RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 121 బుధవారం, జూన్ 12, 2024 పేజీలు : 4

## దుబాయ్‌లో ఘనంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవ సంబరాలు

జగిత్యాల: దుబాయ్ లోని ఏటిసాలట్ అకాడమిాలో స్పార్క్ మీడియా ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆది,సోమ వారాల్లో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ హజరై తెలంగాణ ప్రకాష్, డైరెక్టర్ వినయ్ బాబు, నంగి దేవెందర్ లతో కలసి తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగాతెలంగాణ కళాకారులు సోనీ యాడర్ల, లల్లయిలే మహేష్, మా పల్లె శంకర్ మరియు దుబాయ్ సింగర్ మల్లేష్ కోరేపుల ఉద్యమ పాటలతో సందడి చేశారు.

## ఒడిషా నూతన సీఎంగా...
# మోహన్ చరణ్ మాఝీ



**భువనేశ్వర్ :** ఒడిషా నూతన సీఎంగా మోహన్ చరణ్ మాఝీ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ప్రవతి పరీద డిప్యూటీ సీఎంలుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చీఫ్ నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ ఘోర పరాజయం పాలైన అనంతరం మోహన్ మాఝీ తొలి బీజేపీ సీఎంగా పాలనా పగ్గాలు చేపట్టనున్నారు. నూతనంగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యేల సమావేశంలో శాసనసభా పక్ష నేతగా మోహన్ మాఝీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, భూపేందర్ యాదవ్ పరిశీలకులుగా హాజరయ్యారు. కాగా, 2000, 2004లో బీజేడీతో కలిసి సంకీర్ణ సర్కార్‌లో బీజేపీ భాగస్వామిగా ఉంది. అయితే ఒడిషాలో తొలిసారిగా బీజేపీ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో మోహన్ మాఝీ కెంజహార్ స్థానం నుంచి బీజేడీ అభ్యర్థి మినా మాఝీపై విజయం సాధించారు. ఇక మాఝీ ప్రమాణ స్వీకారం బుధవారం సాయంత్రం భువనేశ్వర్‌లో జరగనుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ సహా పలు రాష్ట్రాల సీఎంలు, ప్రముఖులు హాజరు కానున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి ఇంటి వద్ద గురుకుల అభ్యర్థుల నిరసన



హైదరాబాద్: తమకు న్యాయం చేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్ద గురుకుల అభ్యర్థులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. గురుకుల నియామకాల్లో అవకతవకలు జరిగాయని, గురుకుల బోర్డు వల్ల తాము నష్టపోయామన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి పెద్ద సంఖ్యలో చేరుకున్న గురుకుల అభ్యర్థులు.. బోర్డు చేసిన తప్పులను తమపై రుద్దొద్దని, తమకు న్యాయం చేయాలని కోరారు. సరైన పద్ధతిలో నియామక ప్రక్రియ జరుగకపోవడంతోనే ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు.
తద్వారా చాలా మంది నష్టపోయారని తెలిపారు. ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాము కూడా కోర్టుకు వెళ్లామని, న్యాయస్థానం తమకు అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. అయినా తమకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని వాపోయారు. ఇన్నాళ్లు ఎన్నికల కోడ్ అని సాగదీశారని, ఇప్పుడు స్కూళ్లు కూడా ప్రారంభమవుతున్నాయని తమకు ఇంకెప్పుడు న్యాయం చేస్తారంటూ నిరసన వ్యక్తంచేశారు.



## రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ (తీన్మార్ మల్లన్న) మంగళవారం కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సిఎం రేవంత్ రెడ్డి నివాసంలో తీన్మార్ మల్లన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తీన్మార్ మల్లన్న పుష్పగుచ్ఛం అందజేశారు. కాగా, ఇటీవల నిర్వహించిన వరంగల్ -ఖమ్మం -నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సిఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత కూడా గెలుపునకు సరిపడా కోటా రాకపోయినప్పటికీ తీన్మార్ మల్లన్నకు అత్యధిక ఓట్లు ఉండడంతో ఆయన్నే విజేతగా ప్రకటించారు.

## కెసిఆర్‌కు పవర్ కమిషన్ నోటీసులు




హైదరాబాద్: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావుకు పవర్ కమిషన్ నోటీసులు. విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై కెసిఆర్ కు నోటీసులు. విద్యుత్ కొనుగోలులో కెసిఆర్ పాత్రపై వివరణ కోరిన కమిషన్. ఈ నెల 30 లోగా వివరణ ఇవ్వాలని ఆదేశం. ఒకవేళ కెసిఆర్ సమాధానం సంతృప్తికరంగా లేకుంటే ప్రత్యక్ష విచారణ చేపట్టనున్న పవర్ కమిషన్.

## నీట్ పరీక్ష రద్దుకు సుప్రీంకోర్టు నిరాకరణ

న్యూఢిల్లీ: వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎంట్రెన్స్ కమ్ ఎలిజిబిలిటీ టెస్ట్ అండర్ గ్రాడ్యుయేట్(నీట్ యూజి) పరీక్షను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్ పై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అమానుల్లాహ్ తో కూడిన వెకేషన్ బెంచ్ విచారణ చేపట్టింది. మే 5న జరిగిన నీట్ యూజి పరీక్ష పేపర్ లీకేజ్ ఆరోపణల నేపథ్యంలో పరీక్షను రద్దు చేయాలని పిటిషనర్లు కోరుతున్నారని, దీనిపై సమాధానం చెప్పాలంటూ కేంద్ర ప్రభుత్వానికి, ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్ టిఏ)కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కాగా నీట్ పరీక్షను రద్దు చేయడం అంత సులభం కాదని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. " ఆరోపణలపై మాకు సమాధానాలు కావాల. ఎప్పటిలోగా సమాధానం చెబుతారు? కాలేజీలు తెరుచుకున్న వెంటనే చెబుతారా?... లేకుంటే ఎంబిబిఎస్ కౌన్సలింగ్ మొదలవుతుంది" అని ఎన్ టిఏ తరఫు న్యాయవాదిని ఉద్దేశించి న్యాయమూర్తి అమానుల్లాహ్ అన్నారు. స్పందన తెలుపాలంటూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కి నోటీసలు జారీ చేశారు.

# ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్

## బీజేపీ జనసేనలకూ బాబు క్యాబినెట్‌లో చోటు..?



విజయవాడ: జనసేన వ్యవస్థాపకుడు, పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌కు టీడీపీ అధినేత - ఏపీ సీఎం డిజిగ్నేట్ చంద్రబాబు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పోస్ట్ ఆఫర్ చేసినట్లు తెలుస్తున్నది. ఇటీవల జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. బుధవారం ఉదయం ఏపీ సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. చంద్రబాబు మంత్రివర్గంలో పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా ఉంటారని తెలుస్తున్నది. చంద్రబాబు.. తమ కూటమి జనసేన, బీజేపీలకు ఐదు లేక ఆరు మంత్రి పదవులు ఇవ్వనున్నారని టీడీపీ వర్గాలు చెప్పాయి. పీఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి తొలిసారి అసెంబ్లీకి ఎన్నికైన పవన్ కల్యాణ్.. మెగా స్టార్ చిరంజీవికి సోదరుడు. 2008లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ స్థాపించారు. కానీ తదుపరి కాంగ్రెస్ పార్టీలో ప్రజారాజ్యం పార్టీని విలీనం చేసిన తర్వాత క్రియాశీల రాజకీయాలకు దూరం అయ్యారు. కాగా, 2014లో జనసేన పార్టీని స్థాపించిన పవన్ కల్యాణ్.. నాటి ఎన్నికల్లో ఎన్డీఏ మిత్రపక్షాలు బీజేపీ, టీడీపీలకు బయట నుంచి మద్దతు పలికారు. 2014 ఎన్నికల్లో పవన్ కల్యాణ్ పోటీ చేయలేదు. కానీ ఎన్డీఏ విజయంలో కీలక పాత్ర పోషించారు. పవన్ కల్యాణ్‌తోపాటు జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదేండ్ల మనోహర్ కూడా రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. 2019 ఎన్నికల్లో పోటీ చేసినా, రాజోల్ మినహా అన్ని సీట్లలోనూ ఓటమిపాలయ్యారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీలతో ఎన్డీఏ ఏర్పాటు కావడంలో కీలకపాత్ర పోషించారు.



## ప్రధాని నరేంద్ర మోడీ ఏపీ పర్యటన ఖరారు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ పర్యటన ఖరారైంది. ఈనెల 12న కేసరపల్లి ఐటి పార్కు ప్రాంగణంలో జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోడీ హాజరు కానున్నారు. 12వ తేదీ ఉదయం 8.20 గం.లకు ఢిల్లీ నుండి విమానంలో బయలుదేరి ఉ.10.40.గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారన్నారు. ఉదయం 10.55 గం.లకు అక్కడ నుంచి ఐటి పార్కు ప్రాంగణానికి చేరుకుని ఉ.11 నుండి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.40 గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుని 12.45 గం.లకు విమానంలో భువనేశ్వర్ బయల్దేరి వెళ్తారు. మోదీ పర్యటన నేపథ్యంలో కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు.

## ఏపికి అమరావతి...
# ఒక్కటే రాజధాని : చంద్రబాబు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఒక్కటే నని నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తమ ప్రభుత్వంలో మూడు రాజధానుల డ్రామా ఉండదన్నారు. ప్రమాణస్వీకారానికి ఒక్క రోజు ముందుగానే ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. నారా చంద్రబాబు నాయుడు టిడిపి, బిజెపి, జనసేన శాసనసభ్యుల ఉమ్మడి సమావేశంలో ప్రసంగిస్తూ ఈ విషయాన్ని తెలిపారు. " మా ప్రభుత్వంలో మూడు రాజధానులు ఉండవు, ఒకే ఒక్క రాజధానిగా అమరావతి ఉంటుంది" అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా(2014-2019) చంద్రబాబు నాయుడు నాడు అమరావతిని రాజధానిగా ప్రకటించారు. కానీ తర్వాత ఆయన ప్రభుత్వం పడిపోయాక ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆయన ప్రణాళికను తల్లకిందులు చేశారు. జగన్ మోహన్ రెడ్డి మూడు రాజధానులంటూ కొత్త ప్రయోగానికి నాంది పలికారు. ఇప్పుడు మళ్లీ చంద్ర బాబు నాయుడు అధికారంలోకి రానుండడంతో అమరావతియే ఆంధ్రప్రదేశ్ రాజధాని అని ప్రకటించారు. ఈసారి ఆంధ్రప్రదేశ్ లో ఎన్ డిఏ కూటమి 164 అసెంబ్లీ స్థానాలు, 21 లోక్ సభ స్థానాలను కైవసం చేసుకుంది.

## కూటమి శాసనసభాపక్ష నేతగా చంద్రబాబు ఏకగ్రీవ ఎన్నిక

విజయవాడ: తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి కూటమి శాసన సభాపక్ష సమావేశం విజయవాడ-ఏ కన్వెన్షన్ లో ప్రారంభమైంది కూటమి తరఫున గెలుపొందిన ఎంఎల్ఏలు ఈ సమావేశానికి హాజరయ్యారు. వారంతా నారా చంద్రబాబు నాయుడును శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చంద్రబాబు నాయుడు పేరును ప్రతిపాదించారు. చంద్రబాబును కూటమి శాషనసభాపక్ష నేతగా ఎన్నుకున్న ఏకగ్రీవ తీర్మానాన్ని కూటమి నేతలు గవర్నర్ కు పంపబోతున్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ కూటమికి ఆహ్వానం పంపనున్నారు. నారా చంద్రబాబు నాయుడు బుధవారం ఉదయం 11.27 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. కాగా తనను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నందుకు టిడిపి అధినేత ధన్యవాదాలు తెలిపారు.



## ప్రభుత్వం ఏర్పాటు చేయండి

### చంద్రబాబుకు గవర్నర్ ఆహ్వానం...

ఎపిలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయవలసిందిగా ఎన్డీఏ కూటమి నేత చంద్రబాబు నాయుడిని ఆ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ కోరారు... ఈ మేరకు గవర్నర్ ఆహ్వానం మేరకు నేటి సాయత్రం చంద్రబాబు రాజ్ భవన్ కు వెళ్లి గవర్నర్ ను కలిశారు. ఈ సందర్భంగా తనకు మద్దతు ఇచ్చిన 163 మంది ఎమ్మెల్యేల జాబితాను గవర్నర్‌కు అందజేశారు. అలాగే మంత్రి వర్గ ఏర్పాటు వివరాలపై గవర్నర్ తో చర్చించారు.
ఇక బుధవారం ఉదయం గన్నవరం ఎయిర్‌పోర్ట్ సమీపంలో చంద్రబాబు నాయుడు ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారు. ఆయనతో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించనున్నారు. అందుకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి.

## సంపాదకీయం

# అసమాన వ్యంగ్య చిత్రకారుడు


రాజకీయ కార్టూనులు వేస్తూ, ప్రముఖ వార్తా పత్రికలలో పనిచేస్తూ, అదే వృత్తిగా ఎంచుకుని, స్వతంత్రంగా, నిర్భీతిగా పని చేసిన వ్యంగ్య చిత్రకారులు అతి కొద్దిమంది మాత్రమే ఉన్నారు. అందులో అబూ అబ్రహాం ముఖ్యులు. ఒక కార్టూనులో ఒక పాత్రను ప్రవేశపెట్టి, ఆ పాత్రబొమ్మను అదేవిధంగా దశాబ్దాల పాటు వేయగల శక్తి ఉన్న అతి కొద్దిమంది కార్టూనిస్టులలో అబూ ఒకరు. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రముఖ అబ్జర్వర్ పత్రికకు అబూనే మొట్ట మొదటి రాజకీయ వ్యంగ్య చిత్రకారుడు కావడం విశేషం. సామాన్యంగా ఇంట గెలిచి రచ్చ గెలవడం కాకుండా, అబూ అబ్రహం బయటి దేశాలలో పేరు ప్రఖ్యాతులు సంపాదించి, భారత్ కు తిరిగి రావటం జరిగింది. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందని తన మూడవ ఏట నుండే బొమ్మలు గీయటం మొదలు పెట్టారు. చదువుకునే రోజులలో తమ గురువుల బొమ్మలు కూడా వేసే వారట. అత్తుపురథు మాథ్యూ అబ్రహామ్ (11 జూన్ 1924- 1 డిసెంబర్ 2002), అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రఖ్యాత భారతీయ వ్యంగ్య చిత్రకారుడు, పాత్రికేయుడు, రచయిత. ఆయన కలం పేరు అబూ. ఆయన హేతువాది, నాస్తికుడు. అబూ తన 40 యేళ్ల సుదీర్ఘ వృత్తి జీవితంలో అనేక జాతీయ, అంతర్జాతీయ వార్తా పత్రికలలో పనిచేశారు. "బాంబే క్రానికల్", "శంకర్స్ వీక్లీ", "బ్లిట్జ్", "ట్రిబ్యూన్", "ది అబ్జర్వర్", "ది గార్డియన్", "ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్" తదితర పత్రికలలో పని చేసి గుర్తింపు పొందారు. అబూ కేరళ రాష్ట్రంలోని మవేలికర గ్రామంలో ఎ.ఎం.మాథ్యూ, కాంతమ్మ దంపతులకు జన్మించారు. తన మూడవ యేటి నుండే బొమ్మలు గీయడం మొదలు పెట్టారు. తిరువనంత పురం యూనివర్సిటీ కాలేజీలో ఫ్రెంచి, గణితం, ఇంగ్లీషు ఐచ్ఛికాంశాలుగా 1945లో డిగ్రీ పూర్తి చేశారు. ఇతడు విద్యార్థి దశలో టెన్నిస్ ఛాంపియన్‌గా ఉండేవారు. చదువు ముగిసిన వెంటనే అబూ బొంబాయి వెళ్లి "బాంబే క్రానికల్" పత్రికలోను, దాని సోదర పత్రిక "ది బాంబే సెంటినెల్"లోను జర్నలిస్ట్‌గా చేరారు. "బ్లిట్జ్", "భారత్" పత్రికలలో కార్టూన్లు గీయడం మొదలు పెట్టారు. 1951లో ప్రముఖ కార్టూనిస్ట్ కె.శంకర్ పిళ్ళై అబూను తన "శంకర్స్ వీక్లీ"లో పనిచేయ వలసిందిగా ఢిల్లీకి ఆహ్వానించారు. 1953లో లండన్‌లోని "ది స్టార్" పత్రిక సంపాదకుడు ఫ్రెడ్ జోస్ ఇతడిని లండన్‌కు రావలసినదిగా ప్రోత్సహించారు. ఆయన తన 32వ యేట లండన్‌లో అడుగు పెట్టారు. లండన్ చేరిన వెంటనే అబూ పంచ్, డైలీ స్కెచ్, ఎవెరీబడీస్ లండన్ ఒపినియన్, ఈస్టర్న్ వరల్డ్ మొదలైన పత్రికలకు అబ్రహాం అనే కలం పేరుతో కార్టూన్లు వేయడం ఆరంభించారు. 1956లో ట్రిబ్యూన్ పత్రికలో ప్రచురింపబడ్డ ఇతని రెండు కార్టూన్లను చూసి ప్రపంచంలో అతి పురాతనమైన ఆదివారం వార్తాపత్రిక "ది అబ్జర్వర్" సంపాదకుడు డేవిడ్ ఏస్టర్ ఆయనకు తన పత్రికలో రాజకీయ కార్టూనిస్టుగా స్థిరమైన ఉద్యోగాన్ని ఇచ్చారు. ఆయన సలహాపై అబ్రహాం అనే కలం పేరును తన చిన్ననాటి ముద్దుపేరు ''అబూ''గా మార్చుకున్నారు. అబూ బ్రిటిష్ సంస్కృతిలో మునిగి పోయి వాడి, వేడి రాజకీయ కార్టూన్లను గీశారు. ది గార్డియన్ పత్రిక అబును "త్రికరణ శుద్ధిగా వామపక్ష భావ జాలాన్ని నమ్మి ప్రభుత్వానికి పక్కలో బల్లెంలా తయారైనాడని'' అభివర్ణించింది. 1962లో శాతం క్యూబాలో చేగువేరా చిత్రాన్ని గీశారు. 1966 సెప్టెంబరులో అబూ ది గార్డియన్ పత్రికలో చేరారు. ట్రిబ్యూన్ పత్రికకు వారం వారం కార్టూన్లను వేశారు. 1968లో వియత్నాం యుద్ధంపై వెలువడిన "వర్డిక్ట్స్ ఆఫ్ వియత్నాం" అనే కార్టూన్ల సంకలనానికి సంపాదకత్వం వహించారు. అబూ 1969లో భారత దేశానికి తిరిగి వచ్చారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో 1981 వరకు రాజకీయ కార్టూనిస్టుగా పనిచేశారు. 1970లో ఆయన తీసిన షార్ట్ ఫిలిం నో ఆర్క్‌కు బ్రిటిష్ ఫిలిం ఇన్స్టిట్యూట్ ప్రత్యేక అవార్డును ఇచ్చింది. 1972-78ల మధ్య ఇతడు రాజ్యసభలో నామినేట్ సభ్యుడిగా ఉన్నారు. 1975లో భారత అత్యవసర స్థితి విధించినపుడు పత్రికా స్వేచ్ఛను రద్దు చేశారు. అబూ ఈ చర్యతో ఇందిరా గాంధీ పై ఉన్న అభిమానాన్ని కోల్పోయారు. పత్రికా రంగంలో పని చేసే వారు కొంత మంది, ఎమర్జెన్సీ రోజులలో వంగమంటే, నేలన పడి పాకారని ఒక అపప్రధ ఉన్నది. అటువంటి చెడ్డపేరు, అబూ అబ్రహంకు గాని ఆయన పని చేసిన ఇండియన్ ఎక్స్‌ప్రేస్సుకు గాని రాలేదు. ఆయన ధైర్యంగా ఉండి తన కార్టూన్లను తాను వేస్తూ, సెన్సార్ అధికారులకు అందకుండా, చాలా తెలివిగా కార్టూన్లు గీసి నెగ్గుకు వచ్చారు. ధైర్యం, నిబద్ధత ఉంటే ఎంతటి నియంత అయినా ఏమీ చెయ్యలేదని నిరూపించారు. 1977లో ఎమర్జెన్సీ సమయంలో ప్రచురించ లేక పోయిన రాజకీయ కార్టూన్లు, వ్యాసాలతో "గేమ్స్ ఆఫ్ ఎమర్జెన్సీ" అనే పుస్తకాన్ని విడుదల చేశారు. ఇంకా ఇతడు "అబూ ఆన్ బాంగ్లాదేశ్", "ప్రైవేట్ వ్యూ", "అరైవల్స్ అండ్ డిపార్చర్స్" అనే కార్టున్ పుస్తకాలను ప్రకటించారు. 1988లో వెలువడిన పెంగ్విన్ బుక్ ఆఫ్ ఇండియన్ కార్టూన్స్‌కు సంపాదకుడిగా ఉన్నారు. 1981 నుండి అబూ ఫ్రీలాన్సర్‌గా వివిధ వార్తా పత్రికలకు కార్టూన్లు గీయడం ప్రారంభించారు. "సాల్ట్ అండ్ పెప్పర్" అనే స్ట్రిప్ కార్టూన్ వేయ నారంభించారు. ఎంతో మందిని తన భావ యుక్తమైన కార్టూన్లతో కదిలించిన, ఈ ప్రముఖ వ్యంగ్య చిత్రకారుడు, 2002 సంవత్సరం డిసెంబరు 1 వ తేదీ మరణించారు. ఆయన మరణానికి సంతాప సూచకంగా రాజ్యసభ రెండు నిమిషాల మౌనం పాటించింది. అబూ అంత్య క్రియలను ప్రభుత్వ లాంచనాలతో ఘనంగా నిర్వహించారు.

### ప్రస్తుతం రెండో జాతీయ పార్టీలు అధికారంలో...

## కొనసాగుతున్నందున తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో

# దూసుకెళ్తుందని ఆకాంక్షిస్తున్న...

### - వీరభద్రీయ కుల సంఘం రాష్ట్ర నాయకులు మిట్టపల్లి జగ్గయ్య



**హైదరాబాద్ (గరుడ వార్త):** నాయకుడంటే ఎప్పుడు ప్రతిపక్ష పార్టీలను విమర్శించడమే కాదు, సద్విమర్శతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు సాగేలా తన వంతు కృషి చేయడమేనంటూ తన సోషల్ మీడియా పోస్టుల ద్వారా వీరభద్రీయ కుల సంఘం రాష్ట్ర నాయకులు మిట్టపల్లి జగ్గయ్య చెప్పకనే చెబుతున్నారు. కేంద్రంలో మంత్రులు కూడా కొలువు తీరడంతో , బిజెపి పార్టీ నుండి ఇద్దరు ఎంపీలు కేంద్ర మంత్రులుగా పదవి బాధ్యతలు చేపట్టడం, ఇక రాష్ట్రంలో మరో జాతీయ పార్టీ అయినా, కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగుతుండడంతో మొత్తానికి తెలంగాణ రాష్ట్రంలో రెండు జాతీయ పార్టీల పాలన కొనసాగుతున్నందున తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లుగా వీరభద్రీయ కుల సంఘం రాష్ట్ర నాయకులు మిట్టపల్లి జగ్గయ్య ఆశ భావం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే సోమవారం సోషల్ మీడియాలో తాను చేసిన పోస్టు అందర్నీ ఆలోచింపచేస్తుంది. "పూర్తయిన ప్రక్రియ.. ప్రస్తుతం తెలంగాణలో ప్రభుత్వాలు, మంత్రులు, అధికారం రెండు జాతీయ పార్టీలతో ఉన్నాయి. ఒకరిపై ఒకరు పోటీపడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పట్టిస్తారని, ప్రత్యేకంగా వెనుకబడిన తరగతుల కులాలు, అందులోనూ సంచార జాతులను అభివృద్ధి పథంలో తీసుకెళ్తారని పూర్తి నమ్మకంతో ప్రభుత్వాలకు, మంత్రులకు అభినందనలు తెలియజేస్తున్నాను. కాబట్టి అభివృద్ధి, సంక్షేమం అంశంలో విఫలం చెందకుండా పని చేస్తారని, అలా ఎక్కడైనా విఫలమైతే, ఆ పెద్దాయనను సాకుగా చూపించకుండా, నిందించక, అనాగరిక భాషను ఉపయోగించకుండా తప్పులను సరిదిద్దుకొని ప్రజాసంక్షేమానికి పాటుపడాలని సలహా కూడా ఇస్తున్నాను..


# లగిశెట్టి దయానంద్ పటేల్ ఆధ్వర్యంలో విజయం సాధించిన తీన్మార్ మల్లన్నకు సన్మానం



**శామీర్ పేట (గరుడ వార్త):** ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించిన సందర్భంగా మంగళవారం మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు లగిశెట్టి దయానంద్ పటేల్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మాపూర్ తాజా మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు పటేల్, మున్నూరుకాపు సంఘం ప్రధాన కార్యదర్శి క్యాతం రవి , మాజీ అధ్యక్షుడు సింగం నర్సింగ్ రావు , సంఘం ప్రతినిధులు సింగం పవన్ కుమార్, సింగం భాస్కర్, సింగం రాకేష్,సింగం భాస్కర్, లగిశెట్టి అరుణ్ పాల్గొన్నారు.

# రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు





**శామీర్ పేట (గరుడ వార్త) :** రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే ఎంతటి వార్నైన ఉపేక్షించమని వారికి కఠిన చర్యలు తప్పవని జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్ ఏడిఏ వెంకట్రాంరెడ్డి హెచ్చరించారు. మంగళవారం శామీర్ పేట మండలంలోని పలు విత్తన దుకాణాలను, కంపెనీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించిన, గడువు మీరిన విత్తనాలు విక్రయించిన డీలర్లపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని, విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రైతులకు రసీదులు అందజేయాలని దుకాణంధారులకు సూచించారు. రైతులు సైతం విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను, విత్తన ప్యాకెట్ కవర్లను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని తెలిపారు. శామీర్ పేట, మజీద్ పూర్, బొమ్మ రాసిపేట, బాబా గుడా లలో పలు షాపులు, కంపెనీలలో తనిఖీలు చేశారు. రికార్డులను, పిచ్చన నిలువలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ జానయ్య, శామీర్ పేట మండల వ్యవసాయ అధికారి రమేష్, సీడ్ సర్టిఫికేషన్ అధికారి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్న రెవెన్యూ అధికారులు

**శామీర్ పేట, (గరుడ వార్త):** అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని రెవెన్యూ అధికారి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. రేషన్ బియ్యం ( ప్రజా పంపిణీ బియ్యం) అక్రమంగా తరలిస్తున్నారని పక్క సమాచారం రావడంతో శామీర్ పేట ఆర్ ఐ కుమార్ బొమ్మరాజుపేట పరిధిలోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్లో వాహనాన్ని తనిఖీ చేశారు. ఒక మహీంద్రా వాహనం లో నల్లటి పరదా కప్పుకొని రావడం తో అనుమానం కలిగి వెంటనే ఆ వాహనాన్ని తనిఖీ చేయాగ అందులో 19 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యం 50 తెల్లటి సంచులలో తరలిస్తున్నారు. ఆ వాహనం యొక్క డ్రైవర్ ను విచారించగా నాగాయిపల్లి తండాకు చెందిన బానోత్ సంతోష్ అని తెలిపాడు. ఎటువంటి అనుమతులు లేకుండా అట్టి బియ్యాన్ని నేరెడ్మెట్ ఏరియా లో కొనుగోలు చేసి ముదుచింతలపల్లి మండల పరిసరాల్లో అమ్ముతున్నట్లు తెలిపినట్లు ఆర్ ఐ చెప్పారు. శామీర్ పేట ఆర్ ఐ కుమార్ ఫిర్యాదు మేరకు శామీర్ పేట పోలీస్ లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ





**శామీర్ పేట, (గరుడ వార్త) :** రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నదానం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. లాల్ గడి మలక్ పేట గ్రామానికి చెందిన బిర్కురి సాయిబాబా యాదవ్ తో పాటు పలువురు భక్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## రవాణా శాఖ లో చట్టానికి లోబడి రెవెన్యూ పెంచేందుకు చర్యలు తీసుకోండి

- స్కూల్ బస్సుల ఫిట్నెస్ పై తనిఖీలు నిర్వహించాలి
- ఎన్ ఫోర్స్ మెంట్ ను బలోపేతం చేసి చెక్ పోస్టుల వద్ద నిరంతర నిఘా ఉంచాలి
- రోడ్డు భద్రత పై అవగాహన కల్పించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్: రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన రవాణా శాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో కాన్ఫరెన్స్ హాల్ లో సమీక్షా సమావేశం జరిగింది సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారులు, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్లు , ఆర్టీవో లు తదితర అధికారులు పాల్గొన్నారు.. సమావేశంలో ప్రధానంగా చట్టానికి లోబడి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రెవెన్యూ పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యల పై అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశా నిర్దేశం చేశారు.. త్రైమాసిక టాక్స్ వసూలు కు సంబంధించి తక్కువగా నమోదు చేసిన వివిధ జిల్లాల అధికారులకు తమ పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. 100 శాతం పన్ను వసూలు చేసిన జిల్లా అధికారులను అభినందించారు. సమావేశానికి రాని అధికారులపై నోటీసులు ఇచ్చి వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు. రవాణా శాఖ మంత్రి గా మొదటి శారు డిటిసి లో సమావేశాన్ని ఏర్పాటు చేశామని అధికారులు హుందాగా వ్యవహరిస్తూ రవాణా శాఖ గౌరవాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్న రవాణా శాఖ కార్యాలయాలకు కావల్సిన సొంత భవనాల కోసం ల్యాండ్ సెర్చ్ చేయాలని ముఖ్యమంత్రి గారితో చర్చించి సొంత భవనాల సమస్య పరిష్కారించుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులు రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలని సూచించారు. ఆదాయ అన్వేషణలో విచక్షణ రహితంగా వేధింపుల వల్ల కాకుండా చట్ట ప్రకారమే వ్యవహరించాలని సూచించారు .జిల్లాల్లో విధిగా వాహనాలు తనిఖీ చేయాలని ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేయాలని సూచించారు. అధికారులు ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రస్తుతం ఉన్న రవాణా శాఖకు సంబంధించిన వాహనాలను ఒకే గూటికి తీసుకొచ్చే విధంగా స్టిక్కరింగ్ ఉండేలా చూసుకోవాలన్నారు.

రోడ్డు భద్రత పై రవాణా శాఖ అన్ని స్కూల్ లు ,కాలేజీల్లో రోడ్డు సేఫ్టీ అవగాహన కల్పించేలా ప్రత్యేక ఏర్పాట్లు ఉంటేనే ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలని సూచించారు. ప్రతి స్కూల్ బస్సును తనిఖీ చేయాలని డ్రైవర్లకు ,స్కూల్ బస్సులకు కచ్చితంగా ఫిట్నెస్ ఉంటేనే రోడ్డు ఎక్కేలా చూడాలని అధికారులకు సూచించారు. రోడ్డు భద్రత పై రవాణా శాఖ అధికారులు జిల్లాలో కలెక్టర్ ప్రాభవిక వ్యక్తులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. వారం రోజుల పాటు స్కూల్ లు ,కాలేజీల్లో ఈ కార్యక్రమాలు చేయాలని తెలిపారు.ప్రతి విద్యార్థికి రోడ్డు భద్రత పై కనీస అవగాహన ఉండేలా చూసుకోవాలన్నారు.

# ఓఆర్ఆర్ పై కారులో మంటలు



**శామీర్ పేట, (గరుడ వార్త) :** శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ పై కారులో అకస్మాత్తుగా మంటలు చెలిరేగాయి. మంగళవారం చెన్నయ్ నుంచి డిచ్ పల్లి కి వెళ్తున్న ఒ కార్ సాయంత్రం సమయంలో శామీర్ పేట ఓ ఆర్ ఆర్ కు చేరుకుంది. ఇంతలో ఒక్కసారిగ కార్ నుంచి పొగలు రావడం తో కార్ లో ఉన్న వ్యక్తులు కార్ను నిలిపివేసి బయటకు వచ్చారు. కాగా ఒక్కసారిగ కార్ లో మంటలు చెలరేగాయి దీంతో కార్ మొత్తం దగ్ధం అయ్యింది. విషయం తెలిసిన శామీర్ పేట పోలీసులు సంఘటనన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు ఫైర్ ఇంజన్ కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆర్పేశారు. ఈ ఘటనలోఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాగా శామీర్ పేట పోలీస్ లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# బాబు ప్రమాణ స్వీకారానికి బయలుదేరిన టీడీపీ నేతలు

**విశాఖపట్నం:** చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం కార్యక్రమానికి విశాఖ నుంచి టిడిపి నేతలు తరలివెళ్లారు. ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేలా టిడిపి నేతలు భారీగా ఏర్పాట్లు చేశారు.నాయకుల కోసం ఏర్పాటు చేసి బస్సుల ద్వారా నియోజకవర్గాల నుంచి నాయకులు విజయవాడకు తరలివెళ్లారు.విశాఖ టిడిపి నేత సుధాకర్ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు.తమ నియోజకవర్గాల నుంచి భారీగా నాయకులు తెరలివెళ్తున్నట్లు తెలిపారు.గత ప్రభుత్వ హాయాంలో జరిగిన అక్రమాలపై లోతుగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# తలసాని సోదరుడి అంత్యక్రియలు



**హైదరాబాద్:** మాజీమంత్రి, సనత్ నగర్ ఓఎం తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ అంత్యక్రియలు మంగళవారం వేలాదిమంది సమక్షంలో జరిగాయి. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తెల్లవారుజామున మరణించగా మంగళవారం నాడు కుటుంబ సభ్యులు బన్సీలాల్ పేట లోని గ్రేవ్ యార్డ్ లో అంత్యక్రియలు నిర్వహించారు. మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నీ తానై అంత్యక్రియలు పూర్తయ్యే వరకు పర్యవేక్షించారు. తన అన్న పార్థీవ దేహాన్ని చూసి పలు మార్లు కన్నీటి పర్యంతమైనారు, అది చూసిన వారు సైతం కంట నీరు పెట్టారు. వెస్ట్ మారేడ్ పల్లిలోని రాధికా కాలనీలో గల శంకర్ యాదవ్ నివాసం వద్ద నుండి ప్రారంభమైన అంతిమయాత్రలో కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు అధికారులు వేలాది సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. రాధికా కాలనీ నుండి ప్రారంభమైన అంతిమ యాత్ర జఓఅం, క్లాక్ టవర్, మోండా మార్కెట్, బండి మెట్, సిటీ లైట్ హోటల్, జబ్బార్ కాంప్లెక్స్ మీదుగా బన్సీ లాల్ పేట గ్రేవ్ యార్డ్ కు చేరుకొన్న అనంతరం సాంప్రదాయ పద్దతిలో శంకర్ యాదవ్ అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు వ్యాపారులు, ఃఖీూ పార్టీ నాయకులు, అభిమానులు పలు ప్రధాన కూడళ్ళ వద్ద శంకర్ యాదవ్ చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. అంతిమయాత్ర మోండా మార్కెట్ కు చేరుకున్న సమయంలో మోండా మార్కెట్ లోని పలువురు వ్యాపారులు, మహిళలు శంకర్ యాదవ్ కు నివాళులు అర్పించారు. తమకు అన్ని వేళలా అండగా ఉండే శంకర్ అన్న మరణించాడనే వార్తను నమ్మలేకపోతున్నామని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎదుట కన్నీటి పర్యంతమైనారు.

# ప్రజా భవన్ లో మంత్రి సీతక్క



**హైదరాబాద్:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ ను పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఈ రోజు ఆకస్మికంగా సందర్శించారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నా రెడ్డి తో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను ప్రజాప్రతినిధులకు, అధికారులకు వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ డ్రైవర్ కమ్ ఓనర్ అసోసియేషన్ సభ్యులు ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలల్లో పెరిగినందున ప్యాకేజీ పెంచాలని కోరారు. అన్ని విభాగాలకు సంబంధించి మొత్తం 702 దరఖాస్తులు నమోదయ్యాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 219 దరఖాస్తులు, మున్సిపల్ శాఖకు సంబంధించి 54, హోం శాఖకు సంబంధించి 52, హౌసింగ్ శాఖకు సంబంధించి 44, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 46, ఇతర శాఖలకు సంబంధించి 287 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి, మున్సిపల్ శాఖ సంచాలకులు శ్రీమతి దివ్య, ఇతర అధికారులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులు స్వీకరించండం తో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# అన్న క్యాంటీన్ ప్రారంభం

**హిందూపురం:** శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం శాసనసభ్యుడిగా ఎన్నికైన నందమూరి బాలకృష్ణ తన జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు.ఎన్టీఆర్ ఆరోగ్య రథం, అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించి భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముందుకు వెళ్తామని, హిందూపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

# నాట్యావధాని ధారా రామనాథశాస్త్రి

నటన, మేకప్, రచన అన్ని తానే సమన్వయ పరుచుకొని, మేళవించుకొని అప్పటికప్పుడు పృచ్ఛకుల కోరిక మేరకు ప్రదర్శించాలన్న ఆలోచనకు ప్రతి రూపమే ఈ కొత్త కళా ప్రక్రియ నాట్యావధానము. నాట్యావధాన ప్రక్రియను రంగస్థలం మీద ప్రవేశ పెట్టినది ధారా రామనాథ శాస్త్రి. సాహిత్యములో అష్టావధానాలు, శతావధానాలు, నేత్రావధానాల గురించి వింటూనేఉంటాం. సాహితి సభలు సమావేశాలలో కవి పండితుల అష్టావధానాలను, శతావధానాలను చూసి సాహితి అభిమానులు కవిత్వాలలోని రసజ్ఞతను అనుభవిస్తునే వుంటారు. సాధారణముగా నాట్యావధానము అనగానే ఇదేదో నాట్యానికి సంబంధించినదిగా అనుకుంటారు కానీ నాట్యానికి నాట్యావధానికి సంబంధము లేదు. ఈ ప్రక్రియ నాటక రంగానికి సంబంధించింది కావడం విశేషం. నాటకములో సంభాషణలను ఒక రచయిత రాస్తాడు. ఒక దర్శకుడు నటులకు ఎలా నటించాలో చెపుతాడు. పాత్రకు తగ్గట్టుగా మేకప్ మన్ మేకప్ చేస్తాడు. నటులు నటిస్తారు. రంగస్థలము మీద నాటక ప్రదర్శన సమిష్టిగా జరుగుతుంది. కానీ నాట్యావధానములో రచయిత, దర్శకుడు, మేకప్ మన్, నటుడు అన్నీ ఒకరే. అవసరాన్ని బట్టి మరో పాత్ర ఉంటుంది. నాట్యావధానములో నాట్యావధానికి కొంతమంది పృచ్ఛకులు ఒక నాటకీయ సన్నివేశాన్ని ప్రశ్నగా ఇస్తారు. ఉదాహరణకు గురజాడ కన్యాశుల్కము లోని గిరీశం, చిలకమర్తి వారి గణపతి కలిస్తే ఇద్దరి మధ్య సంభాషణలు ఎలా ఉంటాయి అని అడిగినపుడు... నాట్యావధాని అయన సహాయకుడు, గిరీశమూ, గణపతి పాత్రలకు మేకప్ చేసుకొని పాత్రల ఔచిత్యము దెబ్బతినకుండా అంటే గిరీశం టక్కరితనం, గణపతి తిండిపోతు తనం, అమాయకత్వం కొట్టవచ్చినట్లు ప్రేక్షకులముందు సన్నివేశాన్ని ప్రదర్శిస్తారు.

అలాగే అప్పటి కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, నేటి వచన కవికి తారసపడ్డప్పుడు వారి మధ్య సంభాషణ ఎలా ఉంటుంది. ఈ విధమైన సమస్యలను అవి పౌరాణికాలయినా, చరిత్రనుంచి అయినా, సమకాలీన జీవితమూ నుండి అయినా, సన్నివేశానికి తగ్గట్టుగా మేకప్ చేసుకొని రంగస్థలము మీద అప్పటి కప్పుడు కూర్చుకొన్న సంభాషణలతో రక్తి కట్టిస్తారు. ఈ రకమైన ప్రక్రియ అంతకు ముందు తెలుగు నాటక రంగములో లేదు దీని సృష్టికర్త ధారా రామనాథ శాస్త్రి. అయన మాటల్లోనే చెప్పాలంటే ఇటువంటి కొత్త కళను ప్రారంభించాలని అనుకోలేదు. కానీ విద్యార్థి దశలో ఉన్నప్పుడు అరవై సంవత్సరాల క్రితం మద్రాసు బీచ్ లో కూర్చుని ఉండగా ఆయనకు వచ్చిన ఆలోచన. ధారా రామనాథశాస్త్రి (జూన్ 11, 1932 – ఆగస్టు 7, 2016) నాట్యావధానిగా సుప్రసిద్ధులు. అయన సంప్రదాయక వైదిక కుటుంబంలో 1932, జూన్ 11న ఒంగోలులో సత్యవతమ్మ, వెంకటేశ్వర శాస్త్రి దంపతులకు జన్మించారు. ఆయన తాత ధారా వెంకట సుబ్బయ్య, తండ్రి వెంకటేశ్వరశాస్త్రి ఇరువురూ నాటకాలలో వేషాలు వేసినవారే. చిన్నప్పటి నుండే నాటకాలు, బుర్రకథలు చూసి ప్రభావితు లయ్యారు. చీరాల, తెనాలిలలో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. 1947-49 మధ్యకాలంలో గుంటూరు హిందూ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువు కున్నారు. తరువాత బి.ఏ. చదివారు. మద్రాసు యూనివర్శిటీలో ఎం.ఏ. పూర్తి చేశారు. 1953లో ఒంగోలు లోని సి.ఎస్.ఆర్.శర్మ కాలేజీలో అధ్యాపకులుగా చేరి 1995 జూన్ నెల వరకు పని చేశారు. ఈ నాలుగు దశాబ్దాలలో ఎందరో శిష్యులను తయారు చేశారు.

1970లో ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి కె.వి.ఆర్.నరసింహం పర్యవేక్షణలో తెలుగులో కృష్ణకథ అనే అంశం మీద పరిశోధించి పి.హెచ్.డి సాధించారు. నటుల కుటుంబంలో నుండి వచ్చిన వారు కాబట్టి నటన ఆయనకు కొత్తకాదు. ఆయన తాత గారు ధారా వెంకట సుబ్బయ్య... టంగుటూరి ప్రకాశము పంతులుతో నాటకాలు వేశారు. సంబంధిత ప్రస్తావన మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి రచించిన నటరత్నాలు అనే గ్రంథములో ఉంది. ఒకసారి ప్రకాశము పంతులు హిరణ్య కశిపుని గాను, ధారా వెంకట సుబ్బయ్య నరసింహ స్వామిగా నాటకములో నటిస్తున్నారట. నటనలో పూర్తిగా లీనమైన ధారా వేంకట సుబ్బయ్య, హిరణ్య కశిపుని పాత్రధారి ప్రకాశముపై లంఘిస్తే ప్రాణాలు కాపాడు కోవటానికి ప్రకాశం స్టేజి మీదనుంచి క్రిందకు దూకి పరిగెత్తి బావిలో దూకారట. అంతగా పాత్రలో లీనమై నటించే నటుడు ధారా వెంకట సుబ్బయ్య. ఆయన తండ్రి ధారా వెంకటేశ్వర శాస్త్రి. ప్రముఖ రంగస్థల, సినిమా నటుడు సి.ఎస్. ఆర్ తో కలిసి నాటకాలు వేసేవారు.నాట్యావధానము అనే నూతన ప్రక్రియను వేంకట సుబ్బయ్యనే ప్రారంభించారు. పృచ్ఛకులు సాంఘిక, చారిత్రిక, ఆధ్యాత్మిక, పౌరాణిక అంశాలలో ఏదైనా ఒక సన్నివేశం చెబితే అప్పటికప్పుడు పది నిమిషాలలో ఆ సన్నివేశానికి తగిన ఆహార్యంతో పాత్రోచితంగా నటించడం ఈ అవధానంలో భాగం. అంటే నాట్యావధాని నటుడు, రచయిత, దర్శకుడు, మేకప్ మన్ ఈ నలుగురి పని ఒక్కడే చేయ గలగాలి.

నటన, సాహిత్య సంపద, ఆశుధోరణితో పాటు ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేయ గలగాలి. ఈ నాట్యావధానాన్ని మొదట 1953లో ఒంగోలులో ప్రారంభించి సుమారు 500కు పైగా ప్రదర్శన లిచ్చి ఎందరో ప్రముఖులను మెప్పించ గలిగారు. ఆయన నాట్యావధానాన్ని ప్రశంసించిన వారిలో పుట్టపర్తి సత్యసాయి బాబా, కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి, పండిట్ రవిశంకర్, ఎ.ఎస్.రామన్, హరీంద్రనాథ్ చటోపాధ్యాయ, పృథ్వీరాజ్ కపూర్, బలరాజ్ సహానీ, దివంగత భారత రాష్ట్రపతి వి.వి.గిరి, దివంగత ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు మొదలైన అనేకులు ఉన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారి ప్రతిభా పురస్కారం, బళ్ళారి రాఘవ అవార్డు, అనంత లక్ష్మీకాంత సాహితీ పురస్కారం, రామరాజ భూషణ సాహిత్య పరిషత్ పురస్కారం, పల్లె పూర్ణప్రజ్ఞా చార్యుల సాహితీ పురస్కారం, పెద్దిబొట్ల బ్రహ్మయ్య స్మారక సాహితీ పురస్కారం, అ.జో.వి.భో. ప్రతిభా మూర్తి జీవితకాల సాధన పురస్కారం, విజయవాడలో కనకాభిషేకం, సనాతన ధర్మ ట్రస్ట్ వారి ప్రతిభా పురస్కారం పొందారు. నాట్యావధాన విధాత బిరుదాంకితులు అయినారు. నాట్యావధాన కళాస్రష్ట, బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ ధారా రామనాథ శాస్త్రి 85వ ఏట ఆగస్టు 7, 2016లో కన్నుమూశారు.

# వెట్టిచాకిరీకి అంతం చేద్దాం..!

వాతావరణ ప్రతికూల విపత్తులు, కరోనా కల్లోలాల ఫలితంగా బాల కార్మికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా 217 మిలియన్ల బాల కార్మికులు (ప్రతి 10 మందిలో ఒకరు) ఉన్నారని గమనించాలి. బాల కార్మిక వ్యవస్థ ముఖ్య దుష్ఫలితాల్లో బాలికల లైంగిక వేదింపులు, చర్మ/ఊపిరితిత్తుల/దృష్టి సంబంధ వ్యాధులు, విద్యకు దూరం కావడం, శరీరక మానసిక ఎదుగుదల మందగించడం, అసంఘటిత కార్మికుడిగా బతుకు భారం కావడం లాంటివి వస్తాయి. 5 – 14 లోపు వయస్సు కలిగిన బాలల్ని పనిలో వినియోగించడం చట్టపరంగా నేరంగా చూడబడుతుంది. కౌమారదశలో 14 – 18 ఏండ్ల లోపు యువతను పరిమిత గంటలు సురక్షిత పనులకు మాత్రమే వినియోగించవచ్చని, ప్రమాదకర వాతావరణం మరియు రసాయనాలు లాంటి పరిశ్రమల్లో పనికి వినియోగించవద్దని చట్టం చేరబడింది. విపత్తుల విజృంభనతో పేదలందరూ నిరుపేదలుగా, ఉద్యోగులు నిరుద్యోగులుగా మారడం చూస్తుండగానే జరిగి పోయింది. ఆర్థిక అభద్రత, కుటుంబ ఆదాయం తగ్గడం, సాంఘీక భద్రత కొరవడడం, పాఠశాలలు లేకపోవడం లాంటి కారణాలతో పేద కుటుంబాల పిల్లలు కార్మికులుగా అవతారమెత్తడం మినహా మరో మార్గం లేకుండా పోయింది. లాక్‌డౌన్‌లు పేదల పాలిట అశనిపాతంగా మారిన విషయం మరిచి పోలేదు. పని లేకపోవడంతో ఆకలి చావులకు ఆస్కారం ఏర్పడింది. విద్యాలయాల మూసివేతతో కనీసం మద్యాహ్న భోజన వసతులకు కూడా దూరం కావడం జరిగి పోయింది.

బాలల హక్కులను, స్వేచ్ఛను హరించే బాల కార్మిక వ్యవస్థ అనే దురాచారాన్ని రూపుమాపడానికి 2002 నుంచి ఐరాస, యూనిసెఫ్, అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుక్తంగా ప్రతి ఏట 12 జూన్ రోజున 'ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం' పాటించుట ఆనవాయితీగా మారింది. ఐరాస తీర్మాణం ప్రకారం 2021 ఏడాదిని 'అంతర్జాతీయ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సంవత్సరం'గా కూడా జరుపుకోవడం చూసాం. ఐరాస రూపొందించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా 2025 నాటికి బాల కార్మిక వ్యవస్థను అంతం చేయాలని సంకల్పించి తగు కార్యాచరణను అమలు పరుస్తున్నారు. ఆఫ్రికా, ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లోనే 90 శాతం బాల కార్మికులు ఉన్నారని అర్థం అవుతున్నది. ఆఫ్రికాలో 72 మిలియన్లు (20 శాతం), ఆసియా–పసిఫిక్‌లో 62 మిలియన్లు (7 శాతం), అమెరికాలో 11 మిలియన్లు (5 శాతం), యూరప్–సెంట్రల్ ఆసియాలో 1 మిలియన్ (4 శాతం) మరియు అరబ్ ప్రాంతంలో 3 శాతం బాల కార్మికులు ఉన్నారని అంచన. సహజంగానే పేద ఆర్థికంగా వెనకబడిన దేశాల్లో చిన్నారి చేతులకు కార్మిక సంకెళ్ళు పడుతున్నాయి. పేద, మధ్య ఆదాయ దేశాల్లో 9 శాతం, ఉన్నత మధ్య తరగతి–ధనిక దేశాల్లో 7 శాతం బాల కార్మికులు ఉన్నారు. 5–17 ఏండ్ల లోపు వయస్సు ఉన్న 73 మిలియన్ల బాలలు ప్రమాదకర విషవలయంలో మగ్గుతున్నారు. బాల కార్మికుల్లో 5–11 ఏండ్ల వారు 48 శాతం, 12–14 ఏండ్ల వారు 28 శాతం, 15–17 లోపు వారు 24 శాతం ఉన్నారు. బాల కార్మికులు ముఖ్యంగా 71 శాతం వ్యవసాయం, వ్యవసాయానుబంధ రంగాల్లోనే పని చేస్తున్నారని, 17 శాతం సేవారంగంలో, 12 శాతం పారిశ్రామికరంగంలో గడుపుతున్నారని తేలింది. ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం–2024 నినాదంగా "బాల కార్మిక వ్యవస్థను అంతం చేయడానికి అంకితభావంతో పని చేద్దాం" అనే అంశాన్ని తీసుకున్నారు.

విపత్తులతో నిరుపేద కుటుంబాలకు చెందిన అభాగ్య బాలలు అక్రమ రవాణ అమ్మాయిలు, బలవంతపు కార్మిక సంకెళ్ళు, పేదల అవసరాన్ని ఆసరాగా చేసుకొని లొంగదీసుకోవడం లాంటి అనాచారాలకు లోనయ్యారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం వేదికగా వారం రోజుల పాటు పలు కార్యక్రమాలను నిర్వహించ తలపెట్టారు. ఇటుక బట్టీలు, మట్టి తట్టలు, బాణసంచా తయారీలు, వ్యవసాయ కూలీలు, గృహ సంబంధ పనులు, వెట్టి చాకిరీలు, శ్రమ దోపిడి, అమానవీయ చర్యలు, వలసలు, గృహ వసతి లేమి లాంటి ప్రమాదకర పనుల్లో చిన్నారుల బతుకులు చితికి పోవడం అమానవీయం.ఇలాంటి అంశాలను గమనిస్తూ ప్రభుత్వాలు, స్వచ్ఛంధ సంస్థలు, కార్మిక సంఘాలు, పౌర సమాజం అంకితభావం, సమన్వయాలతో నడుంబిగించి బాలలకు వేసిన కార్మిక సంకెళ్ళను నిర్దయగా తొలగించే ముమ్మర ప్రయత్నాలు చేయాలి. బాలల్ని శారీరక, మానసిక, సాంఘీక, మానవీయ కోణంలో ఎదిగేలా పటిష్ట చర్యలు చేపట్టాలి. నేటి బాలలైన రేపటి పౌరులకు స్వేచ్ఛ, హక్కులను కల్పిద్దాం.

# మారిషస్ దీవిలో తెలుగు దివ్వె సర్ అనిరుధ్ జగన్నాథ్

ప్రపంచ దేశాలలో తెలుగు కుటుంబాల మూలాలుగల అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన వారు ఎందరో ఉన్నారు. ఆంధ్రావని నుండి వలస వెళ్ళి, పలు దేశాలలో రాజకీయాలలో రాణిస్తూ వివిధ పదవులు పొందిన, పొందుతున్న వారెందరో ఉన్నారు. అయితే ఒక దేశ రాజకీయాలను ప్రభావితం చేసి, రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగి, ఆ దేశ సర్వోన్నత అధ్యక్ష పదవి పొందడం సామాన్య విషయం కానేకాదు. అలాంటి నేపద్యం కలిగిన మహోన్నత వ్యక్తి అనిరుధ్ జగన్నాథ్. మారిషస్ దేశానికి పదేళ్ళపాటు అధ్యక్షుడుగా, పద్దెనిమిదేళ్ళ పాటు ప్రధాన మంత్రిగాను పనిచేసిన అరుదైన, అపూర్వమైన, అనితర సాధ్యమైన ఘనత సర్ అనిరుధ్ జగన్నాథ్ కే దక్కింది. మారిషసు ఆఫ్రికా ఆగ్నేయ తీరంలో 2,000 కి.మీ (1,200 మై) దూరంలో ఉంది. 19 ఖీ 58.8 'నుండి 20 ఖీ 31.7' దక్షిణ అక్షాంశం, 57 ఖీ 18.0 'నుండి 57 ఖీ 46.5' తూర్పు రేఖాంశం మధ్య ఉంటుంది. ఇది 65 కి.మీ(40 మై) పొడవు, 45 కి.మీ (30 మై) వెడల్పు ఉంటుంది. ప్రారంభంలో డచ్చి కాలనీ (1630–1710) తరువాత ఫ్రెంచి కాలనీ (1715–1810)గా ఉండి తరువాత బ్రిటిషు కాలనీగా మారి 1968 వరకు బ్రిటిషు ఆధీనంలో ఉండి తరువాత స్వతంత్రం పొందింది. 1835లో బానిసత్వ నిర్మూలన నిర్ణయం జరిగాక, మారిషస్ సమాజం, ఆర్థిక వ్యవస్థ, ప్రజా జీవితాలపై ప్రభావం చూపాక, చాలామంది వ్యవసాయ కూలీలుగా, చెరుకు తోటలో పని చేసేందుకు మారిషస్ కు తీసుకెళ్ల బడినారు. 1834 -1921 మధ్య కాలంలో దాదాపు ఐదు లక్షల మంది ఇలా బ్రతుకు తెరువు కోసం వెళ్లారు. వారు చక్కెర ఎస్టేట్ లలో, కర్మాగారాలలో, రవాణా, నిర్మాణ రంగాలలో పని చేశారు. బ్రిటిష్ ప్రభుత్వానికి సేవలు చేసేందుకు, ఒప్పంద సేవకులుగా పని చేసేందుకు ప్రవేశించిన తొలి దేశం మారిషస్ కావడం గమనార్హం.

అలా కుటుంబం 1850లో ఉత్తర ప్రదేశ్ లోని బల్లియా జిల్లాలోని రాస్డా పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని అతిల్పురా గ్రామానికి చెందిన కొందరు మారిషస్ ద్వీపానికి వ్యవసాయ కూలీలుగా వలస వెళ్ళారు. బ్రిటిష్ ప్రభుత్వం చెరకు సాగు కోసం ఓడ ద్వారా తీసుకెళ్లిన వారిలో విదేశీ యాదవ్ ఒకరు. విదేశీ యాదవ్ కార్మికుడి కుమారుడైన అనిరుధ్ జగన్నాథ్1930 మార్చ్ 29న ఒక యాదవ కుటుంబంలో జన్మించారు. అనిరుధ్ జగన్నాథ్ రాజకీయ జీవితం 1963లో ప్రారంభమైంది. తొలిసారిగా 1963లో లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. మారిషస్ స్వాతంత్ర్యానికి సంబంధించిన అంశాలపై చర్చించేందుకు లండన్ వేదికగా 1965లో జరిగిన రాజ్యాంగ సదస్సులో ఆయన పాల్గొన్నారు. 1968లో బ్రిటిషు ఆధీనంనుండి విముక్తి కలిగి స్వతంత్ర దేశంగా గుర్తింపు పొందింది. అనిరుధ్ మిలిటెంట్ సోషలిస్ట్ మూమెంట్ పార్టీని స్థాపించి, మారిషస్ రాజకీయాలలో సుస్థిర స్థానం ఏర్పరచు కున్నారు. మారిషస్ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగి, ఆధునిక మారిషస్ నిర్మాతగా చరిత్రకెక్కారు.

అనిరుద్ 1982 నుంచి 2017 మధ్య ఆరుసార్లు మారిషస్ ప్రధాని పదవిని చేపట్టారు. తొలిసారి 1985 నుంచి 1995, తర్వాత 2000 నుంచి 2003, 2014 నుంచి 2017 వరకు ప్రధానిగా ఉన్నారు. 2003 నుంచి 2012 వరకు అధ్యక్షుడిగా పనిచేశారు. 2017లో కుమారుడు ప్రవింద్‌కు మార్గం సుగమం చేస్తూ ఆయన పదవి నుంచి తప్పుకొన్నారు. అలా ప్రస్తుత మారిషస్ ప్రధాని ప్రవీంద్ కుమార్ అనిరుధ్ జగన్నాథ్ కుమారుడే కావడం గమనార్హం. మారిషసు ప్రజలలో బహుళ సంప్రదాయాలు, బహుళ మతాలు, బహుళ సంస్కృతులు, బహుళ భాషలకు చెందిన ప్రజలు ఉన్నారు. ద్వీప దేశ ప్రభుత్వం వెస్టు మినిస్టరు పార్లమెంటరీ సిస్టం విధానంలో రూపొందించ బడింది. అక్కడ ఉన్న 12.5 లక్షలకు పైగా జనాభాలో లక్ష మందికి పైగా తెలుగువాళ్లు ఉంటారు. అనిరుధ్ జగన్నాథ్‌కు తమ పూర్వీకుల జన్మభూమి అయిన భారత దేశమంటే అమితమైన ప్రేమాభిమానాలుండేవి. భారత్ %–% మారిషస్ దేశాల మైత్రీ బంధానికి ఆయన బంగారు బాటలు వేశారు.

అనిరుధ్ జగన్నాథ్ నాయకత్వంలో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు 1980 డిసెంబర్ 10వ తేది నుంచి 13వ తేది వరకు మారిషస్?లోని మోకా నగరంలో మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూటులో ఘనంగా జరిగాయి. ఆశించిన రీతిలో ఆనాడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహాసభలకు సరిగా సహకరించ కున్నా, చేయూత అందించక పోయినా, మారిషస్ ప్రభుత్వమే మొత్తం బరువు బాధ్యతలను తలకెత్తుకుని అపూర్వంగా ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడానికి కారకుడు అనిరుధ్ జగన్నాథ్. మారిషస్?లో ఏటా జరిగే తెలుగు పండుగలకు, ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవాలకు, జాతీయ నాటికల పోటీలకు స్వయంగా హాజరయ్యేవారు. 1981లో మారిషస్ తెలుగు కల్చరల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. తెలుగు భవనం నిర్మించడానికి పది ఎకరాల స్థలం కేటాయించారు. భగవాన్ శ్రీ సత్య సాయిబాబా భక్తుడైన జగన్నాథ్ చాలాసార్లు పుట్టపర్తి వచ్చి వెళ్ళారు. ఆయన నేత్ర చికిత్సకు హైదరాబాద్? లోని ఎల్.వి.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూటును ఎంపిక చేసుకోవడం విశేషం. భారత ప్రభుత్వం ఆయనకు పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందజేసి, భారత సంతతికి చెందిన ఒక విదేశీ నేతను గౌరవించింది. మారిషస్ దేశానికి పదేళ్ళపాటు అధ్యక్షుడుగా, పద్దెనిమిదేళ్ల పాటు ప్రధాన మంత్రిగా పనిచేసిన సర్ అనిరుధ్ జగన్నాథ్ 2021 జూన్ 3న తమ 91వ ఏట పరమ పదించారు.

# ప్రేమికురాలి మోసం తట్టుకోలేక....

**నల్గొండ:** ఎంతో గాఢంగా ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య తప్పు చేసిందని చూసి తట్టుకోలేక ఓ భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలాంటి వాళ్ల మన ఫ్యామిలీలో ఉండొద్దని వారిని మాత్రం వదలొద్దని చెబుతూ ఓ వ్యక్తి సూసైడ్ చేసుకున్నాడు. సూర్యపేట జిల్లా హుజూర్ నగర్‌లో జరిగిన ఈ దుర్ఘటన ఇప్పుడు సంచలనంగా మారింది. సూర్యపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన రంజిత్ ఫొటో గ్రాఫర్. పక్క గ్రామంలోనే యువతిని 14 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీళ్లకు ఇద్దరు కుమార్తెలు. సాఫీగా సాగిపోతున్న వీరి జీవితంలోకి మూడో వ్యక్తి వచ్చాడు. అంతే మొత్తం మారిపోయింది. ఫ్యామిలీ కకావికలమై ఇంటి పెద్దనే కోల్పోయింది. రంజిత భార్య స్థానికంగా ఉండే ఓ వ్యక్తితో వివాహేతర సబంంధం పెట్టుకుంది. ఈ విషయం తెలుసుకున్న రంజిత్ ఆమెను మార్చేందుకు చాలా ప్రయత్నాలు చేశాడు. కానీ ఆమెలో మార్పు రాలేదు. ఈ విషయంపై ఇద్దరి మధ్య రోజూ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ప్రతి రోజూ గొడవలు జరుగుతుండటంతో రంజిత్ భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటనలో మరింత ఆందోళనకు గురయ్యాడు రంజిత. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య ఎందుకు ఇలా చేస్తుందో అర్థం కాక మానసింగా కుంగిపోయాడు. అద్దెకు ఉంటున్న ఇంటిని ఖాళీ చేశాడు. ఇద్దరి పిల్లల్ని తీసుకొని తన చెల్లి ఇంటికి వెళ్లిపోయాడు. అక్కడ కూడా భార్య గురించే ఆలోచించాడు. సడెన్‌గా తాము గతంలో ఉన్న ఇంటికి వచ్చాడు. అక్కడే ఉరి వేసుకొని చనిపోయాడు. అప్పటికే ఆ ఇల్లు ఖాళీగా ఉండటంతో దాన్ని ఎవరూ గమనించలేదు. సాయంత్రానికి ఆ ఇంటి నుంచి వాసన వస్తుండటంతో స్థానికులు గమనించారు. రంజిత్ డెడ్‌బాడీని చూసి షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి డెడ్‌బాడీని కిందికి దించి పోస్టు మార్టానికి పంపించారు. రంజిత్ చనిపోక ముందు ఓ వీడియోను షూట్ చేశాడు. దాన్ని వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. ఆలస్యంగా స్నేహితులు దాన్ని చూశాడు. అప్పుడు అసలు విషయం వెలుగులోకి వచ్చింది. భార్య చేసిన మోసాన్ని భరించలేకపోతున్నానని... మర్చిపోలేకపోతున్నట్టు అందులో తెలిపారు. ఇద్దరు పిల్లల్ని సరిగా చూసుకోవాలని తమ్ముడికి అప్పగించాడు. తాను ఇక ఉండలేనంటూ చెల్లెలకు చెప్పిన విధానం అందర్నీ కంటతడి పెట్టిస్తోంది. తనను మోసం చేసిన భార్యను ఆమెతో సంబంధం పెట్టుకున్న వ్యక్తిని అసలు విడిచి పెట్టొద్దని మాత్రం చెప్పాడు. ఆ వీడియో ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ



ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండల కేంద్రంలోని ఐకెపి సెంటర్ లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఏకరూప దుస్తులను మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం అందజేశారు. పాఠశాల ప్రారంభం, జూన్ 12న విద్యార్థులందరికీ ఈ దుస్తులు పంపిణీ చేయవలసిందిగా మండల విద్యాధికారి సర్దార్ నాయక్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

**విద్యార్థికి ఆర్థిక సహాయం అందించిన కెఎస్ఆర్**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 2కు చెందిన కృష్ణ, సంగీతల కుమార్తె భూమిక ఇంజనీరింగ్ థర్డ్ ఇయర్ చదువుతున్నది. తమ పాప ఉన్నత చదువు నిమిత్తం తమ ఆర్థిక స్థితిని నరసింహ యాదవ్ తో కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డికి విన్నవించగా కె. ఎస్. ఆర్ సానుకూలంగా స్పందించి భూమిక ఫీజు నిమిత్తం తనవంతుగా రూ. 50, 000/- ఆర్థిక సహాయం అందించారు.

**నాంపల్లి లో ముగిసిన చేప ప్రసాదం పంపిణీ**

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో చేప ప్రసాదం పంపిణీ ముగిసింది. 2 రోజులుగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. చేప ప్రసాదం కోసం ప్రజలు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి తరలివచ్చారని వెల్లడించారు. సహకరించిన అధికారులకు, పోలీస్ సిబ్బందికి నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

**అంబర్ పేట్ లో బీజేపీ నాయకులు సంబరాలు**

ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ మూడోసారి అధికారం చేపట్టడంతో హైదరాబాద్ లో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. అంబర్ పేట్ లోని డిడి కాలనీలో బీజేపీ శ్రేణులు సంబరాలు అంబరాన్నంటాయి. మోడీ మూడోసారి ప్రధాని అవ్వడం, రాష్ట్రం నుంచి ఇద్దరికీ కేంద్రమంత్రి పదవులు ఇవ్వడం సంతోషకరం అన్నారు. ఈ సందర్భంగా మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. రామ్ రెడ్డి, కృష్ణ గౌడ్, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



గజ్వేల్: తెలంగాణ ఉద్యమ కారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు అందె అశోక్, అంబటి అంజయ్య గౌడ్ అన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఉద్యమకారులను ఏనాడు పట్టించుకోలేదని, కేసీఆర్ నియంత పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని తీసుకురావడంలో తెలంగాణ ఉద్యమకారులు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు.

కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రానికి భక్తుల తాకిడి

కొమురవెల్లి మండలంలోని భక్తులపాలిట కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా వీరాజిలుతున్న ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయనికి భక్తుల రద్దీ పెరిగింది. వేకువ జామున లేచి కోనేరులో స్నానం ఆచరించి మల్లికార్జున స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన రేణుక ఎల్లమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన యన్ సీ సీ సంయుక్త శిక్షణ శిబిరం

గత పది రోజులుగా గజ్వేల్ పట్టణంలోని బాలుర విద్యా సముదాయంలో నిర్వహించబడుతున్న యన్ సీ సీ సంయుక్త శిక్షణ శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమాన్ని క్యాంప్ కమ్మాడాంట్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్ రావు నిర్వహించారు. మొదటగా ఈ పది రోజుల శిబిరంలో కాడెట్ లకు అందజేసిన శిక్షణను, శిబిర నివేదికను క్యాంప్ డిప్యూటీ కమ్మాడాంట్ కెప్టెన్ డాక్టర్ భవాని అందజేశారు.

# గంగపుత్ర సంఘం భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

సికింద్రాబాద్ కంటోన్మెంట్: బీసీ కులాలు సంఘటితంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాలని మాజీ మంత్రివర్యులు మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. బౌద్ధనగర్ డివిజన్ లో గంగపుత్ర భవనాన్ని స్థానిక కార్పొరేటర్



జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ కంది శైలజ శ్రీకాంత్ తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం సంఘ నేతలు పద్మారావు గౌడ్ ను ఘనంగా సన్మానించారు. వారి వెంట మాజీ కార్పొరేటర్ కంది నారాయణ తదితరులున్నారు.

# భూకబ్జాదారులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ పట్టణంలోని కైలాష్ నగర్ లో సొసైటీ కీ సంబదించిన 8 ప్లాట్లలో 2 ప్లాట్లని తప్పుడు ధ్రువ పాత్రలతో కబ్జాలు చేయడానికి ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీ డెవలప్ మెంట్ కమిటీ అధ్యక్షులు లోక ప్రవీన్ రెడ్డి, ఉపాధ్యక్షులు దుర్గంశేఖర్ సోమవారం కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ రాజర్షి షా ను కలిసి సమస్యను విన్నవించారు. తక్షణమే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులను దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన

తమ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళనకు దిగారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ముందుగా ర్యాలీగా వచ్చిన కార్మికులు ధర్నా చేపట్టి నిరసన నినాదాలు చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించి, 10వేల వేతనం ఇవ్వాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల చిన్నాన్న కార్యక్రమంలో కేశవ్, లక్ష్మీ, తులసి తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం వెంటనే ఇవ్వాలి

రేషన్ దుకాణం ద్వారా ప్రజలకు సన్నబియ్యం అందించాలని ఆదర్శ కళా సమితి డైరెక్టర్ లింగంపల్లి రాజలింగు అన్నారు. సోమవారం మధ్యాహ్నం జన్నారంలోని ప్రెస్క్లబ్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యాన్ని ఇవ్వడం లేదని, దీంతో వారు ఆ బియ్యాన్ని తినలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వం ప్రజలకు లబ్ధిదారులకు సన్న బియ్యం ఇస్తామని హామీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు.

కామన్ పల్లిలో శివాజీ మహారాజ్ విగ్రహం ప్రతిష్టాపన

జన్నారం మండలంలోని కామన్ పల్లి గ్రామంలో శివాజీ సేన యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన కిరణ్ గా జరిగింది. సోమవారం గ్రామ ప్రజలు, మండల హిందూ పరిషత్ నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీగా తిరిగి విగ్రహ ప్రతిష్టాపనను నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివాజీ సేనా యూత్ అధ్యక్షులు రాఘంశెట్టి ప్రవీణ్ , ఉపాధ్యక్షులు కొత్తపల్లి నరేష్, సర్పంచ్ పేరం మానస శ్రీనివాస్ ఉన్నారు.

అన్ని దరఖాస్తులను పరిష్కరిస్తాం



ప్రజల నుండి వచ్చిన అన్ని దరఖాస్తులు పరిష్కరించేలా దృష్టి పెట్టామని ఉట్నూర్ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్తా అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఉట్నూర్ పట్టణంలోని ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ, గిరిజన ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు ఆదివాసి ప్రజలు ఉన్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలో సాయంత్రం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కరీంనగర్-వరంగల్ వెళ్తున్న లారీని.. వెనకాలే ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వాహనదారుల సమాచారంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతుల వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఐఐటీ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రభంజనం

మానకొండూరు: నిన్న ప్రకటించబడిన ఐ.ఐ.టి అడ్వాన్స్- 2024 ఫలితాలలో మా అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో జాతీయస్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించారని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.నరేందర్ రెడ్డి తెలిపారు. యం.హర్షిత్ 64వ ర్యాంకు సాదించగా, జి. శ్రీహాస్ 290, బి. భరద్వాజ్ 396, ఆర్. పునీత్ మనోహర్ 477, సుబోద్ చౌదరి 545, ఎ.శివవరుణ్ 557, పి.రాహుల్ 571, దేవదత్త 751, విశాల్ రెడ్డి 838, డి. రిశ్వంత్ కుమార్ 1029, పి. మనోహర్ 1229, నిహాల్ 1379, ఆదిత్యవర్ధన్ రావు 1523, లహరి 1609, అరుణ్ కుమార్ 1658, బి. అభినవ్ సిదార్ధ రెడ్డి 1851, సత్య అమూల్య 1933 ర్యాంకులు సాధించి "అల్ఫోర్స్" ఖ్యాతిని మరింత పెంచారని తెలిపారు. 1,000 లోపు 9 మంది విద్యార్థులు, 2,000 లోపు 17 మంది విద్యార్థులు, 5,000 లోపు 32 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడం గొప్ప విశేషం అన్నారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ మరియు విద్యార్థుల ఆహర్నిష కృషి ఇంతటి ఘనవిజయానికి తోడ్పడ్డాయన్నారు. ప్రతి సంవత్సరం ఆల్ఫోర్స్ అందించిన ఐఐటి కోచింగ్ ద్వారా ప్రతిష్టాత్మక ఐఐటిలలో సీట్లు సాధించే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఐఐటి-2024 ఫలితాలలో అద్భుత ర్యాంకులు సాధించిన మా అల్ఫోర్స్ విద్యార్థులను అభినందించారు.

ఘనంగా అమ్మవార్లకు బోనాల నైవేద్యాలు

బోయినపల్లి మండలం నర్సింగాపూర్లో ముదిరాజ్ కులస్తులు ఘనంగా పోచమ్మ, పెద్దమ్మ బోనాలను సమర్పించుకొని సేవలో తరించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ. ప్రజలందరూ సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధి కురిసి పాడిపంట పిల్ల పాపలు చల్లగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. మహిళా భక్తులందరూ సాంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేకంగా కనువిందు చేశారు.

రాజన్న భక్తులకు ఉచితంగా పాలు పంపిణీ

వేములవాడ రాజన్న ఆలయ భక్తులకు స్థానిక వ్యాపారవేత్త కటకం కిషన్ రాజ్యలక్ష్మి వారి కుమారుడు కటకం నాగరాజు రాధిక దంపతులు




సోమవారం భక్తుల 100లీటర్ల పాలు పంపిణీ చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా కోడె చెల్లించుకునే భక్తుల క్యూలైన్లలో ఉన్నవారికి మరి ముఖ్యంగా పంపిణీ చేశారు. భక్తి భావంతో రాజన్న భక్తులకు పాలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రీనివాస్ ఉన్నారు.

వేములవాడలో భక్తుల సందడి

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. దీంతో ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ధర్మ దర్శనంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ముందుగా పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారికి ఇష్టమైన కోడె మొక్కలతో పాటు ఇతర మొక్కులు చెల్లించుకొని సేవలో తరించారు. స్వామివారికి ఇష్టమైన సోమవారం సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

వైరా నియోజకవర్గ వ్యాప్తంగా భగీరథ ఇంటింటి సర్వే

గత ప్రభుత్వం ఇంటింటికి శుద్ధ జలాన్ని అందించేందుకు ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. కానీ క్షేత్రస్థాయిలో చాలా ఇళ్లకు నీరు సరఫరా కావడం లేదని ప్రస్తుత ప్రభుత్వం గుర్తించింది. గత ప్రభుత్వం ఇంటింటికి తాగునీరు అందుతుందని నివేదిక ఇవ్వడంతో కేంద్ర ప్రభుత్వ నుంచి జల్ జీవన్ మిషన్ పథకం నిధులు సైతం విడుదల కాలేదు. దీంతో సమస్యలను గుర్తించేందుకు సోమవారం నుంచి ఇంటింటి సర్వే ప్రారంభించారు.

# ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి:

వరంగల్ వెస్ట్, : వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వినతులు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య స్వీకరించారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను జిల్లా కలెక్టర్కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి రాలేకపోయారు. ప్రజావాణిలో వచ్చిన ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.



ఎన్నికల హామీలను అమలు చేయాలి

ఎంసిపిఐ (యు)తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు హనుమకొండ నాయాబ్ తహసిల్దార్ రంజీత్ కి హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం నాగార్జున మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల మౌలిక సమస్యలు ఆరోగ్యం గృహవసతి నివాస స్థలాలు పౌష్టిక ఆహారం, నిత్యావసర ధరలు విద్య నిరుద్యోగం లాంటి సమస్యలను పూర్తిగా విస్మరించిందన్నారు.

ఓవర్ లోడుతో వెళ్తున్న 5 ఇసుక లారీలు సీజ్

వాజేడు మండలం జగన్నాధపురం వద్ద అతివేగంగా వస్తున్న 5 ఓవర్ లోడ్ ఇసుక లారీలను గుర్తించి సీజ్ చేసినట్లు సోమవారం ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ డిడి కంటే 5 టన్నుల ఇసుక అదనంగా తరలిస్తున్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు. వాజేడు మండలంలోని అయ్యవారిపేటకు చెందిన 2, రాంపూర్ కు చెందిన 3 లారీలుగా గుర్తించామన్నారు. కేసు నమోదు చేసి వాజేడు పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యోగా శిక్షణ తరగతులు

పరకాలలో కొనసాగుతున్న యోగా శిక్షణ తరగతులు యోగా సాధన ద్వారా వివిధ అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చు యోగా ద్వారా శరీరాన్ని కూడా స్ట్రెచ్బుల్గా ఉంచుకోవచ్చు. మనస్సును రిలాక్స్ చేయడంతో పాటు కంటి నిండా నిద్రపోవడానికి యోగా సాయం చేస్తుంది. ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా ఎముకల ఆరోగ్యాన్ని పెంచుకోవడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని కూడా మెరుగుపర్చుకోవచ్చు. అలాగే దీర్ఘకాలిక రుగ్మతల నుంచి యోగా సాధన ద్వారా రక్షణ పొందవచ్చు అని యోగా గురువు కొలుగూరి రాజేశ్వర్ రావు తెలిపారు.

అడవికి వెళ్లి మహిళ మృతి

అడవికి వంటచెరుకు తేవడానికి వెళ్ళిన ఒక మహిళ మృతిచెందిన సంఘటన వెల్దుర్తి ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. మానేపల్లి గ్రామానికి చెందిన చాకలి బాగమ్మ(55) ఎప్రిల్ 18వ తేదీన అడవిలోకి వంటచెరుకు తేవడానికి వెళ్ళింది. తిరిగిరాకపోవడంతో కుమారుడు కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు మిస్సింగ్ కేసునమోదు చేశారు. అడవి ప్రాంతంలో మహిళా మృతదేహం లభించడంతో భాగమ్మగా గుర్తించినట్లు ఎస్సై నవతగౌడ్ తెలిపారు.

చుక్కలు చూపిస్తున్న ధరలు

వర్షాకాలం ఆరంభం కానున్న సమయంలో కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సాధారణంగా ఏటా ఆషాఢం, శ్రావణమాసంలో ధరలు పెరిగి సామాన్యులను కుదేలు చేస్తుంటాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో గతేడాది సరైన వర్షాలు పడకపోవడం, ఎండలు తీవ్రంగా ఉండటంతో ఈసారి స్థానికంగా కూరగాయల సాగు, దిగుబడి తగ్గింది. పది రోజుల క్రితం కిలో పచ్చిమిర్చి రూ.60 నుంచి 80 ఉండగా.. ప్రస్తుతం రూ.120 పలుకుతోంది.

భక్తులతో సందడిగా మారిన కొమురవెల్లి మల్లన్న ఆలయం

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న ఆలయం భక్తులతో సందడిగా మారింది. ఆలయ పరిసరాలు మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. స్వామివారికి అభిషేకాలు, పట్నాలు, ఒడిబియ్యం, అర్చనలు, గంగిరేణి చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఆలయ ఈవో, సిబ్బంది పర్యవేక్షించారు.

# ఖమ్మంపాడు గ్రామంలో బడిబాట కార్యక్రమం చేపట్టిన ఉపాధ్యాయులు



ఖమ్మం: ఖమ్మం జిల్లా మధిర మండల పరిధిలోని ఖమ్మంపాడు గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మీ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ

పినపాక మండలంలోని సీతారాంపురం శివారులో బీటీపీఎస్ వద్ద సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టగా.. ఈ ఘటనలో ద్విచక్రంపై ఉన్న వారికి గాయాలయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు వారిని మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఏడూళ్ళ బయ్యారం సీఐ కరుణాకర్, ఎస్ఐ వెంకటప్పయ్య ఘటనాస్థలానికి చేరుకుని లారీ డ్రైవర్ ని అదుపులోకి తీసుకున్నారు.

250 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్, పోలీసులు తల్లాడలో పట్టుకున్నారు. ఎస్ఐ కొండల్ రావు కథనం ప్రకారం.. ఖమ్మం నుంచి కాకినాడ రంగంపేటకు లారీలో 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లోడ్ చేసుకొని, పైన టార్పాలిన్లు కప్పుకొని తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. లారీడ్రైవర్ ను అదుపులోకి తీసుకొని బియ్యాన్ని, లారీని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు.

స్వయం కృషి వృద్ధాశ్రమంలో అన్నదానం చేసిన బిక్షపతి

హనుమకొండ జిల్లాలోని ములుగు రోడ్డులో గల స్వయంకృషి వృద్ధాశ్రమంలో హన్మకొండ మ్యూజిక్ సంస్థ ఛైర్మన్ బిక్షపతి తన పుట్టినరోజు సందర్భంగా సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాలో వద్ధాశ్రమాలు చాలా ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ఒక పూట అన్నం పెడితే ఇలాంటి వారి కడుపు నిండుతుందని అన్నారు. సాయం చేసిన వారికి కూడా జీవితంలో తృప్తి ఉంటుందని బిక్షపతి అన్నారు.

నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ పై విచారణ జరపాలి

దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్ ) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదాల్ల శరత్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మే 5న పరీక్షను నిర్వహించడం జరిగిందని అన్నారు.

# మండలాలకు చేరుకున్న పాఠ్యపుస్తకాలు



2024-25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు మండల కార్యాలయాలకు చేరుకున్నాయి. పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, కాపీలు అందించాలన్న ప్రభుత్వం లక్ష్యంతో అధికారులు మండల కార్యాలయాలకు పుస్తకాలను గత రెండు రోజులుగా తరలించే ఏర్పాట్లు చేశారు. సోమవారం మండల కార్యాలయాల నుంచి కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాలలకు తరలించే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

మోడీ నాయకత్వంలో పని చేయడం అదృష్టం

ప్రధానిగా మూడవ సారి ప్రమాణ స్వీకారం చేసి నేడు పదవి బాధ్యతలు స్వీకరించిన నరేంద్ర మోడీ నాయకత్వంలో పని చేయడం ఆనందంగా భావిస్తున్నామని బిజెపి రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డీకే అరుణ గెలుపు కొరకు పని చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞలు తెలిపారు. సరైన సమయంలో డీకే అరుణకు కీలకమైన స్థానం లభిస్తుందని అన్నారు.

వనపర్తిలో ప్రారంభమైన ప్రజావాణి

వనపర్తి జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం పునఃప్రారంభమైంది. ఎన్నికల సందర్భంగా కొంతకాలం ప్రజావాణిని నిలిపివేసిన విషయం తెలిసిందే. వనపర్తిలో నేడు నిర్వహిస్తున్న ప్రజావాణిని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి సందర్శించారు. హైదరాబాదులో తను నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఇక్కడ నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఉన్న తేడాను పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

అమ్మపల్లిలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని అమ్మపల్లి గ్రామానికి గంగాపూర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు అనంతప్ప తన ఉపాధ్యాయ బృందంతో సందర్శించారు. గ్రామంలో 13 ఏళ్లుగా మూతపడిన ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులను పంపించి పునఃప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను కోరారు.

## పీరియడ్స్ సమయంలో ఈ తప్పులు చేయకండి..



బహిష్టు సమయంలో మహిళలు మూడ్ స్వింగ్స్, బ్యాక్ పెయిన్, పెల్విక్ ఫ్లోర్ పెయిన్, కండరాలు బిగుసుకుపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటారు. ఈ సమస్యలన్నీ చాలా సహజమైనవి. కొన్ని నివారణల సహాయంతో ఈ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. కానీ పీరియడ్స్ సమయంలో చేసే కొన్ని పొరపాట్లు మీ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. అంతే కాదు తరువాతి నెలలో వచ్చే పీరియడ్స్ సమయంలో కూడా సమస్యలను ఎదుర్కోవచ్చు. ప్రతి నెలా పీరియడ్స్ వచ్చే మూడు – నాలుగు రోజులలో మహిళలు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఈ సమయంలో పరిశుభ్రత నుండి తినడం, తాగడం వరకు కొన్ని విషయాల పై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. కాబట్టి పీరియడ్స్ సమయంలో ఎలాంటి పొరపాట్లకు దూరంగా ఉండాలో తెలుసుకుందాం. పీరియడ్స్ సమయంలో పరిశుభ్రతను నిర్వహించడం చాలా ముఖ్యం. లేకుంటే అది యోని ఇన్ఫెక్షన్‌కు దారితీయవచ్చు. కొన్నిసార్లు జాగ్రత్త తీసుకోకపోతే పరిస్థితి తీవ్రంగా మారవచ్చు. మీరు పీరియడ్స్ సమయంలో ప్యాడ్‌లు లేదా టాంపాన్‌లను ఉపయోగిస్తుంటే, వాటిని కనీసం 6 గంటలకు ఒకసారి మార్చాలి. పీరియడ్స్ సమయంలో మహిళలు తరచుగా ద్రవ పదార్థాలు లేదా నీటిని తాగడం మానుకుంటారు. తద్వారా వారు మళ్లీ మళ్లీ వాష్‌రూమ్‌కు వెళ్లే ఇబ్బందిని నివారిస్తారు. అయితే ఇది మీ ఆరోగ్యానికి చాలా హానికరం. నీరు త్రాగడం వల్ల తిమ్మిరి సమస్యను తగ్గిస్తుంది. కాబట్టి మిమ్మల్ని మీరు హైడ్రేట్ గా ఉంచుకోవడం చాలా ముఖ్యం.ఆరోగ్యంగా ఉండాలంటే ఎప్పుడూ డైట్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ పీరియడ్స్‌లో బలహీనత, అలసట మొదలైన సమస్యలు ఉంటాయి. శరీరానికి అదనపు పోషకాహారం కూడా అవసరం. కాబట్టి ఆహారంలో పండ్లు, కూరగాయలు, డ్రై ఫ్రూట్‌లను సమతుల్య పద్ధతిలో చేర్చాలి. అంతే కాదు ఈ సమయంలో అతిగా వేయించినవి, జంక్ ఫుడ్స్, శీతల పానీయాలు మొదలైన వాటికి దూరంగా ఉండటం మంచిది. పీరియడ్స్ సమయంలో మహిళలు వ్యాయామం చేయాలా వద్దా అనే ప్రశ్న తరచుగా ఉంటుంది. పీరియడ్స్ సమయంలో హెవీ ఎక్సర్ సైజ్ చేసే బదులు కాస్త లైట్ యాక్టివిటీస్ చేయడం మంచిది. పీరియడ్స్ సమయంలో తీవ్రమైన వర్కవుట్‌లు చేయడం వల్ల కండరాలలో విపరీతమైన నొప్పి, వాపు వస్తుంది.

## సబ్జానీరు తాగడం వల్ల ప్రయోజనాలు



ఉదయం లేవగానే నీరు తాగే అలవాటు చాలా మందికి ఉంటుంది..కొందరు హనీ వాటర్ మరికొందరు లెమన్ వాటర్ అంటూ స్పెషల్ కేర్ కూడా తీసుకుంటారు. కానీ కొందరు ఏకంగా సబ్జా నీరు కూడా తాగుతుంటారు. మరి ఈ వాటర్ వల్ల ఏమైనా ప్రయోజనాలు ఉన్నాయా? ఎందుకు ఈ నీళ్లు తాగుతారు అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. ప్రతి రోజు ఉదయం సబ్జా నీరు తాగడం వల్ల ప్రయోజనాలు ఉంటాయి అంటున్నారు నిపుణులు. ఇందులో పోషకాలు, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇన్ని ఖనిజాలు ఉన్న వీటి వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుందట. మల్లబద్ధకం సమస్య కూడా తగ్గుతుంది అంటున్నారు నిపుణులు. యాసిడ్, గ్యాస్ వంటి సమస్యలను తొలగించడంలో కూడా సహాయం చేస్తాయి సబ్జా గింజలు. అందుకే ఈ నీటిని తాగాలి అంటున్నారు నిపుణులు. సబ్జా గింజలను రాత్రి పూట నీటిలో నానబెట్టి ఉదయమే తాగడం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయి. విత్తనాల్లో ఫైబర్ కంటెంట్ పెరుగుతుంది. అందుకే వీటిని సేవించడం వల్ల బరువు కూడా తగ్గుతారు. మధుమేహ వ్యాధిగ్రస్తులలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో సబ్జా నీరు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇందులోని ఫైబర్ జీర్ణక్రియ, కార్బోహైడ్రేట్లు శోషణను నెమ్మదిస్తుందట. దీని వల్ల చక్కెర స్థాయిలు పెరగకుండా ఉంటాయి. సబ్జా గింజల్లో యాంటీ అలెర్జిక్ లక్షణాలు ఉన్నాయి. మొటిమలు అలర్జీ వంటి సమస్యల నుంచి కూడా రక్షిస్తాయి. ఉదయం ఖాళీ కడుపుతో సబ్జా గింజల నీటిని తాగితే చర్మం మెరుస్తుందట. సబ్జా గింజల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయం పడతాయి. సబ్జా గింజలు గుండెపోటును నివారించడంలో తోడ్పడతాయి. అంతేకాదు రక్తం గోడకట్టే అవకాశాన్ని కూడా తగ్గిస్తాయి.

## టమాటల వల్ల బరువు తగ్గవచ్చా?



పుల్లగా ఉండే టమోటాలో పోషకాలు ఎక్కువే. ఇక ఇది వంటల్లో ముఖ్య పాత్ర పోషిస్తుంది. అందానికి కూడా చాలా ప్రయోజనాలను అందిస్తుంది టమాట. సరిగ్గా ఉపయోగిస్తే బరువు తగ్గడంలో కూడా సహాయం చేస్తుందట.మరి అవేంటో తెలుసుకుందామా? ఈ టమాటలను స్నాక్‌లా కూడా తినొచ్చు. మరి స్నాక్స్ కోసం ఏం చేయాలంటే..కాస్తా ఉడికించి ఉప్పు, మిరియాల పొడితో కాల్చి తినేయాలి అంతే. ఇది డైట్ చేసేవారికి బెస్ట్ స్నాక్. కేలరీలు తక్కువ కాబట్టి బరువు కూడా తగ్గుతారు. టమాటాలలో కేలరీలు తక్కువ అయితే పోషకాలు మాత్రం ఎక్కువ ఉంటాయి. విటమిన్ సి, పొటాషియం, ఫోలేట్ వంటి విటమిన్స్, ఖనిజాలు కూడా ఎక్కువ ఉంటాయి కాబట్టి ఇవి బరువు తగ్గడంలో హెల్ప్ చేస్తాయి. అంతేకాదు ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు కూడా చాలా ఎక్కువ ఉంటాయి. లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇది శరీరంలో వాపు, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంటాయి. క్యాలరీలు తక్కువ ఉండటంతో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ ఉంటుంది. దీని వల్ల చక్కెర స్థాయిలు కంట్రోల్ లో ఉంటాయి అంటున్నారు నిపుణులు.బాడీలో కొలెస్ట్రాల్ పేరుకుపోవడాన్ని తగ్గించి శరీర బరువు కంట్రోల్‌లో ఉంటుంది. ఆకలిని అరికడుతుంది. డైటరీ ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. అందుకే చాలాసేపు కడుపు నిండుగా ఉన్నట్టుగా ఉంటుంది. ఇందులో ఫైబర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయం చేస్తుంది. జీర్ణక్రియ మెరుగైతుంది. దీనికి కారణం టామాటాలో 95 శాతం నీరు ఉండటమే. టమాటోల్లోని ఫైబర్, వాటర్ కంటెంట్ రెండూ కూడా కడుపు నిండుగా ఉండి.. చాలా సేపటి వరకూ ఆకలి కలగకుండా చూస్తాయి. అతిగా తినడాన్ని కంట్రోల్ చేస్తాయి. అయితే వీటిని సలాడ్‌లా తీసుకోవచ్చు. సూప్‌గా కూడా తీసుకోవచ్చు. దీంతో కడుపు నిండుగా ఉండి బరువు తగ్గడంలో చాలా హెల్ప్ అవుతుంది.

## పచ్చి అరటికాయ ఉపయోగాలు...



చిన్నా పెద్ద అరటి పండ్లు తినడానికి ఇష్టపడతారు. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయని తింటారు. కానీ అరటికాయతో చేసిన పదార్థాలకు మాత్రం దూరంగా ఉంటారు. కనీసం అరటికాయతో వండిన కూరను కూడా అసహ్యించుకుంటారు. కానీ పచ్చి అరటికాయను తినడం వల్ల కూడా చాలా ఆరోగ్య ప్రయోజనాలు కలగడంతో పాటు పలు సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అరటికాయలు పండ్ల లాగా తియ్యగా లేనప్పటికీ శరీరానికి అవసరమైన విటమిన్లు, పోషకాలు, పొటాషియం, ఖనిజాలను అందించి అనారోగ్య సమస్యలను తగ్గిస్తాయి. పచ్చి అరటికాయలో పిండి పదార్థాలు కలిగి ఉండటం వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు తగ్గిస్తాయి. అంతేకాకుండా డయాబెటీస్ పేషంట్స్‌కు ఇవి ఎంతో మేలును కలిగిస్తాయి. మలబద్ధకంతో బాధపడేవారు అరటి కాయలతో చేసిన పదార్థాలు తరచూ తినడంతో సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. ప్రస్తుతం చాలా మంది చిన్నా పెద్ద స్పైసీ ఫుడ్స్ తినడానికే ఎక్కువగా ఇష్టపడుతున్నారు. నిత్యం స్పైసీగా తినడం వల్ల అల్సర్ వంటివి వచ్చి ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి అలాంటి వారికి అరటికాయలు దివ్య ఓషధంలా పని చేస్తాయి. ఇటీవల కాలంలో ఎంతో మందిని గుండె జబ్బులు వేదిస్తూ.. కొందరి ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. మరీ ముఖ్యంగా గుండెపోటు కారణంగా చాలా మంది ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అయితే గుండె ఆరోగ్యంగా ఉండాలంటే అరటికాయను తీసుకోవడం మంచిది. ఈ మధ్య కాలంలో అంతా కూర్చుని చేసే ఉద్యోగాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో పొట్ట రావడంతో పాటుగా అధిక బరువు సమస్య వేధిస్తోంది. పచ్చి అరటికాయలు బరువు తగ్గించి నాజుకుగా తయారు చేస్తాయి. అరటి కాయలు కడుపు నింపడంతో పాటుగా.. బరువు తగ్గడానికి సహాయపడుతాయి.

## అల్లం టీ మాత్రమే కాదు..

### – దాని రసం కూడా ఆరోగ్యానికి మంచిదే..



భారతీయ వంటగదిలో ఉండే ముఖ్యమైన పదార్థాల్లో అల్లం ఒకటి. ఆహారంలో రుచి, వాసనను పెంచడానికి దీనిని ఉపయోగిస్తారు. అల్లం ఆహారం రుచిని పెంచడమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని ఆయుర్వేద వైద్యనిపుణులు చెబుతున్నారు. భారతీయులు అల్లంని వంటలలో వేయడం మాత్రమే కాదు అల్లంతో టీని కూడా తయారు చేసుకుని తాగుతారు. అద్భుతమైన రుచిని కలిగిన ఉండే అల్లం టీని ఇష్టపడని వారు ఎవరూ ఉండరు. అందుకే ఏ సీజన్ వచ్చినా అల్లం టీ తాగడం మానరు. అల్లం టీలో, ఆహారంలో రుచిని పెంచడమే కాకుండా అనేక విధాలుగా ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంతో పాటు, చాలా మందికి గ్యాస్ నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. అల్లం దాని పోషక లక్షణాలతో ఎంతో ప్రసిద్ధి చెందింది. అందుకే దీన్ని శతాబ్దాలుగా భారతీయ వంటశాలలలో ఉపయోగిస్తారు. దీన్ని రోజూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మలబద్ధకం, అసిడిటీ, అజీర్ణం వంటి జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. వంట, టీ రుచిని పెంచడమే కాకుండా, మీరు మీ ఆహారంలో అల్లం రసాన్ని కూడా చేర్చుకోవచ్చు. అయితే మీరు ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో అల్లం రసాన్ని తాగితేనే దాని ప్రయోజనాలను పొందుతారు.

1. వికారం, వాంతుల నుండి ఉపశమనం..అల్లంలోని ఔషధ గుణాల కారణంగా ఇది వికారం, వాంతులను నివారించడంలో ప్రభావవంతంగా పరిగణిస్తారు. గర్భధారణ సమయంలో వికారాన్ని నివారించడంలో కూడా అల్లం రసం ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతే కాదు కీమోథెరపీ, మోషన్ సిక్‌నెస్ వల్ల వచ్చే వికారం కూడా నివారిస్తుంది. 2. రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణ..ఇది ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయకారిగా ఉంటుంది. అల్లం రక్తంలో చక్కెర స్థాయిని వేగంగా తగ్గించగలదని, %నూదీజ% స్థాయిని మెరుగుపరుస్తుందని అనేక పరిశోధనలలో కనుగొన్నారు. 3. కొలెస్ట్రాల్ నియంత్రణ..అల్లం ఎల్‌డిఎల్ స్థాయిలను తగ్గించడంలో, హెచ్‌డిఎల్ స్థాయిలను పెంచడంలో ప్రభావవంతంగా పనిచేస్తుందని రుజువు చేస్తుంది. దీనితో పాటు గుండెను కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. ఎందుకంటే అధిక స్థాయి %ాణూ% కొలెస్ట్రాల్ గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. 4. జలుబు, దగ్గులో ప్రభావవంతం.. ప్రతిరోజూ మీ ఆహారంలో అల్లం రసాన్ని చేర్చుకోవడం వల్ల మీ రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. తద్వారా సీజనల్ వ్యాధుల నుండి మిమ్మల్ని కాపాడుతుంది. అంతే కాదు శరీరంలోని వాపులను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.

## యవ్వనంగా ఉండాలంటే వీటిని తినండి..



ఎప్పుడు యవ్వనంగా ఉండాలి అని ఎవరు కోరుకోరు చెప్పండి. కానీ చాలా కష్టం కదా.కొన్ని ఆహారాలు తినడం వల్ల ఎప్పుడు యవ్వనంగా ఉంటారు. మరి అవేంటో చూసేద్దాం.ఆకుకూరల్లో చర్మానికి కావాల్సిన విటమిన్స్ ఎ, సి, కెలు ఉంటాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, ఐరన్ రక్తప్రసరణను పెంచుతాయి. దీంతో చర్మం కాంతివంతంగా యవ్వనంగా కనిపిస్తుంది .దానిమ్మ పండ్లలో ఉండే అనేక రకాల విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి మేలు చేస్తాయి. సూర్యకిరణాల నుంచి చర్మాన్ని రక్షించడానికి ముడతలను తగ్గించడానికి దానిమ్మ ఉపయోగప డుతుంది. కండరాల బలహీనత కారణంగానే శరీరం బలం కోల్పోతుంది. దీనివల్ల చర్మం జీవం కోల్పోయినట్టుగా కనిపిస్తుంది. అందుకే శరీరంలో కండరాలను దృఢంగా ఉంచడానికి ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి.బ్రకోలీలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కలిగి ఉండటంతో చర్మాన్ని అందంగా యవ్వనంగా ఉంచేందుకు దోహదపడతాయి.టమాట తింటే కూడా చర్మం యవ్వనంగా ఉంటుంది. టమాటాలను ఉడికించి, పచ్చిగా, సలాడ్ చేసుకొని తినాలి. ఏ రూపంలో అయినా తినవచ్చు. అవకాడోలో విటమిన్ బి, విటమిన్ సి, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇందులో యాంటీ ఏజింగ్ గుణాలు ఉన్నాయి. వీటిని తరచు తినడం వల్ల యంగ్ గా కనిపిస్తారు. నట్స్ లో విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లతో హెల్తీ ఫ్యాట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ చర్మ సమస్యలను తగ్గించి ముడతలను మాయం చేస్తాయి. దీంతో నిత్యం యవ్వనంగా ఉంటారు.

## పెరుగుతో వీటిని తింటున్నారా?




కడుపు చల్లగా ఉండటానికి పెరుగు చాలా ఉపయోగపడుతుంది. పెరుగుతో ప్రయోజనాలు ఎన్నో ఉంటాయి. ప్రోటీన్, కాల్షియం, ప్రోబయోటిక్స్ సమృద్ధిగా ఉన్నందున శరీరానికి చాలా ప్రయోజనాలు ఉంటాయి.అయితే పెరుగుతో కలిపి మాత్రం కొన్ని ఆహారాలు తినకూడదు. దీని వల్ల అనారోగ్య సమస్యలు పెరుగుతాయి. మరి అవేంటో ఓసారి చూసేద్దామా.. కొందరు చేపలు వండుతున్నప్పుడు అందులో పెరుగు వేస్తారు. లేదా తిన్న తర్వాత పెరుగు తింటారు. కానీ ఇలా అస్సలు తినకూడాదు. ఇవి రెండు వ్యతిరేక ప్రభావాన్ని కలిగి ఉంటాయి. దీని వల్ల శరీరంలో అసమతుల్యతలు ఏర్పడతాయి. అలెర్జీలు, దద్దుర్లు, ఇతర సమస్యల వంటి చర్మ సమస్యలను కలిగిస్తుంది ఈ మిశ్రమం. కొన్ని సార్లు పెరుగు పుల్లగా ఉంటుంది. ఇలాంటి పెరుగును నారింజ, నిమ్మ, ద్రాక్ష తదితర పుల్లని పండ్లతో కలిపి తింటే కడుపులో ఎసిడిటీ పెరుగుతుంది. ఇది జీర్ణ సమస్యలు, అసిడిటీ, కడుపు నొప్పివంటి సమస్యలను కలిగిస్తుంది. పెరుగు, ఉడికించిన గుడ్డు కలిపి కూడా అసలు తీసుకోవద్దు. ఈ రెండూ ప్రోటీన్‌ను అందిస్తాయి. కానీ వీటిని కలిపి తింటే జీర్ణవ్యవస్థ మీద ఒత్తిడి తెచ్చి, పొత్తికడుపు భారాన్ని, గ్యాస్‌ను కలిగిస్తుంది. ఉల్లిపాయ, పెరుగు మిశ్రమాన్ని కూడా నివారించడమే బెటర్. ఈ కలయిక జీర్ణవ్యవస్థను దెబ్బతీసి.. కడుపులో చికాకు, గ్యాస్, ఇతర సమస్యలను కలిగిస్తుంది. రాత్రిపూట పెరుగు తినడం ఆరోగ్యానికి అసలు మంచిది కాదు. ఇక రాత్రిపూట పెరుగు తినడం వల్ల కఫం ఎక్కువ అవుతుంది. దీనివల్ల జలుబు, దగ్గు, కఫం వంటి సమస్యలు వస్తాయి.. పెరుగు, మామిడికాయలు కలిపి తింటే బాగుంటుంది. కానీ ఇది ఆరోగ్యానికి మాత్రం ఎంత మంచిది కాదు. మామిడి, పెరుగు కలిపి తీసుకోవడం వల్ల శరీరంలో టాక్సిన్స్ ఏర్పడి జీర్ణ సమస్యలు, చర్మ సమస్యలకు దారితీస్తుంది.

గరుడ వార్త


# అన్ లిమిటెడ్ షో...



బద్రి , కహెూ నా ప్యార్ హై, గదర్: ఏక్ ప్రేమ్ కథా వంటి హిట్ చిత్రాలలో తన అద్భుత నటనతో పాపులరైన బాలీవుడ్ నటి అమీషా పటేల్ మరోసారి హెడ్ లైన్స్ లోకొచ్చింది. ఈసారి తన అద్భుతమైన ఫోటోషూట్ అంతర్జాలంలో హాట్ టాపిక్ గా మారింది. ఇటీవలి సోషల్ మీడియా పోస్ట్‌లో అమీషా చెకర్డ్ బికినీలో ఉన్న తన అద్భుతమైన ఫోటోలను షేర్ చేసింది. 48 ఏళ్ల వయస్సులో కూడా ఇంత ఫిట్‌గా, టోన్డ్ ఫిజిక్‌ని మెయింటైన్ చేసినందుకు అభిమానులు అమీషాను ప్రశంసిస్తున్నారు. స్విమ్మింగ్ పూల్ పరిసరాల్లో తీసిన ఫోటోలు, బికినీతో చెలరేగుతున్నవి.. జుట్టు స్వేచ్ఛగా వదిలేసి హావభావాలు పలికించడం వగైరా చాలా విషయాలున్నాయి. దీనికి 'వేసవి కాలం' అని క్యాప్షన్ ఇచ్చింది. అమీషా పటేల్ పింక్ కలర్ గ్లామ్ మేకప్ లుక్ లో అదరగొట్టింది. అమీషా పటేల్ బికినీ ఫోటోలు సోషల్ మీడియా లలో వేగంగా వైరల్ అయ్యాయి.




## 'సరిపోదా శనివారం' ఫస్ట్ సింగిల్ రిలీజ్ డేట్ ఫిక్స్..

వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న లేటెస్ట్ అప్‌కమింగ్ మూవీ 'సరిపోదా శనివారం'. అంటే సుందరానికి తర్వాత ఈ సినిమాతో వీరి కాంబో మరోసారి రిపీట్ అవుతోంది. ఆగస్ట్ 29న ఈ సినిమా విడుదల కాబోతోంది.. ఈ సినిమా ప్రమోషన్స్ స్టార్ట్ అయ్యాయి. ఈ క్రమంలో సినిమాలోని ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. 'గరం.. గరం' అనే ఫస్ట్ సింగిల్‌ను 15వ తేదీన (శనివారం) ఈ సాంగ్ రిలీజ్ విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. మలయాళ సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ ఈ సినిమాకి సంగీతం అందిస్తున్నారు. తెలుగులో టాక్సీ వాలా, చావు కబురు చల్లగా, పక్కా కమర్షియల్, ఒకే ఒక జీవితం చిత్రాలకు జేక్స్ ఇప్పటికే సంగీత దర్శకుడిగా పనిచేశారు.


## గ్యాంగ్ స్టార్ డ్రామా 'మీర్జాపూర్'.. మూడో సీజన్ టీజర్




పాపులర్ క్రైమ్-డ్రామా సిరీస్ 'మీర్జాపూర్' రెండు సీజన్లతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అయిన ఈ సిరీస్ బ్లాంక్ బస్టర్‌గా నిలిచింది. కాగా, అత్యంత ప్రశంసలు పొందిన ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా మూడవ సీజన్ విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా ఈ సిరీస్ మూడవ సీజన్ టీజర్‌ను విడుదల చేశారు మేయర్స్. పంకజ్ త్రిపాఠి, శ్వేతా త్రిపాఠి, అలీ ఫజల్, హర్షిత గౌర్, విజయవర్మ తదితరులు ఈ వెబ్ సిరీస్‌లో కీలక పాత్రల్లో నటించారు. గుర్మీత్ సింగ్, ఆనంద్ అయ్యర్ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. మీర్జాపూర్-3 సీజన్ జూలై 5 నుండి అమెజాన్ ప్రైమ్‌లో ప్రసారం కానుందని మేకర్స్ వెల్లడించారు.

## 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' నుంచి 'సుట్టంలా సూసి' ఫుల్ వీడియో సాంగ్

టాలీవుడ్ నటుడు మాస్ కా దాస్ విశ్వక్ సేన్ చాలారోజుల తర్వాత 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాతో హిట్ కొట్టిన విషయం తెలిసిందే. కృష్ణచైతన్య దర్శకత్వం వహించిన ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ చిత్రం మే 31న ప్రేక్షకుల ముందుకు వచ్చి ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తుంది. పాజిటివ్ రెస్పాన్స్‌తో దూసుకుపోతున్న రీసెంట్‌గా బ్రేక్ ఈవెన్‌ను కూడా పూర్తి చేసుకుంది. అయితే ఈ సినిమా విడుదలై నెల కూడా కాకముందే ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ చిత్రం జూన్ 14 నుంచి తెలుగుతో పాటు కన్నడ, మలయాళం, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ కానున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ క్రమంలోనే తాజాగా మూవీ నుంచి 'సుట్టంలా



సూసి' ఫుల్ వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. శ్రీ హర్ష యెమని రాసిన ఈ పాటను యువన్ శంకర్ రాజా కంపోజిషన్‌లో అనురాగ్ కులకర్ణి పాడాడు. మాస్ స్టైలిష్ గెటప్‌లో విశ్వక్‌సేన్, గులాబీ రంగు చీరలో నేహాశెట్టి చేసిన డ్యాన్స్ ఈ పాటకే హైలైట్‌గా నిలిచింది.

# ఐపీవోకు బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్




న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది.ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. తద్వారా రూ. 7,000 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఐపీవోలో భాగంగా రూ. 4,000 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా మరో రూ. 3,000 కోట్ల విలువైన షేర్లను మాతృ సంస్థ బజాజ్ ఫైనాన్స్ విక్రయానికి ఉంచనుంది. ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగా కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు సన్నాహాలు ప్రారంభించింది. ఎగువ స్థాయి(అప్పర్ లేయర్) ఎన్‌బీఎఫ్‌సీగా బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ 2025 సెప్టెంబర్‌కల్లా పబ్లిక్ ఇష్యూ చేపట్టవలసి ఉంది. కాగా.. భవిష్యత్ అవసరాలరీత్యా ఐపీవో నిధులను మూలధన పటిష్టతకు వినియోగించనుంది. నేషనల్ హౌసింగ్ బ్యాంక్ వద్ద 2015లోనే బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ రిజిస్టర్ అయ్యింది. డిపాజిట్లు స్వీకరించని హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీగా కొనసాగుతోంది. రెసిడెన్షియల్, కమర్షియల్ ఆస్తుల కొనుగోలు, ఆధునీకరణ తదితరాలకు ఆర్థిక సహకారాన్ని అందిస్తోంది. ఆర్‌బీఐ వద్ద అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా గుర్తింపు పొందింది. గృహ రుణాలు, మార్టిగేజ్, లీజ్ రెంటల్ డిస్కౌంటింగ్ తదితర సేవలు సమకూర్చుతోంది. గత ఆర్థిక సంవత్సరం(2023–24)లో 38 శాతం వృద్ధితో రూ. 1,731 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇటీవల గృహ రుణ కంపెనీలు ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్, ఇండియా షెల్టర్ ఫైనాన్స్ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయిన సంగతి తెలిసిందే.

# భారత విమానయాన రంగంలో పుష్కల అవకాశాలు



న్యూఢిల్లీ: భారత్‌ను దిగ్గజ విమానయాన విపణిగా చెబుతూ... ఎయిరిండియా, లుఫ్తాన్సాల మధ్య బలమైన భాగస్వామ్యం ఉండటం మంచి పరిణామమని స్టార్ అలయన్స్ సీఈఓ థియో పానాజియో టౌలియాస్ అభిప్రాయపడ్డారు .భాగస్వాముల ను ఒక్కచోటకు చేర్చాలనే ప్రయత్నం ద్వారా ప్రయాణికులందరికీ ఏకరీతిలో ప్రయోజనం కలిగేలా చేయాలన్నదే స్టార్ అలయన్స్ ఉద్దేశమని తెలిపారు. 26 విమానయాన సంస్థలు సభ్యత్వం కలిగిన స్టార్ అలయన్స్‌లో ఎయిరిండియా, లుఫ్తాన్సా సంస్థలు కూడా భాగంగా ఉన్నాయి. 'పుష్కల అవకాశాలు ఉన్న భారత్ విపణిపై సానుకూల ధృక్పథంతో ఉన్నామ'ని ఐఏటీఏ వార్షిక సాధారణ సమావేశం అనంతరం పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆయన తెలిపారు. భాగస్వామ్య సంస్థలను ఒక్క చోటకు తేవడం వల్ల ప్రయాణికులకు ఎంపిక విషయంలో మరిన్ని అవకాశాలు లభిస్తున్నాయని, భారత విపణి పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకుంటే అది ఎంతో మంచి విషయమని అన్నారు.ఎయిరిండియా, లుఫ్తాన్సాల మధ్య భాగస్వామ్యంపై స్పందిస్తూ.. అలయన్స్‌లోనే బలమైన భాగస్వామ్యాలు ఉండటం ప్రయోజనకరమేనని తెలిపారు. ఈ రెండు సంస్థల మధ్య బలమైన కోడ్‌షేర్ ఒప్పందాలు ఉండటం వల్ల ఇరు సంస్థల ప్రయాణికులకు గమ్యస్థానాల అనుసంధానత విషయంలో మరింత వెసులుబాటు లభిస్తుందని అన్నారు. మరోవైపు ఐఏటీఏ వార్షిక సాధారణ సమావేశం సమయంలో ఎయిరిండియా సీఈఓ, మేనేజింగ్ డైరెక్టరు క్యాంప్‌బెల్ విల్సన్‌తో లుఫ్తాన్సా గ్రూపు ఛైర్మన్, సీఈఓ కార్‌స్టెన్ స్పోర్ భేటీ అయ్యారు. లాభదాయకతను సాధించే దిశగా ఆకాశ ఎయిర్ అడుగులు వేయగలదని ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు ఆదిత్య ఘోష్ ఆశాభావం వ్యక్తం చేశారు. దక్షిణాసియా, ఆగ్నేయాసియాలోని ప్రాంతాలకు సహా మరిన్ని అంతర్జాతీయ గమ్యస్థానాలకు సర్వీసులను విస్తరిస్తామన్నారు. సామర్థ్యానికి తగ్గట్లుగా భారత విమానయాన రంగ వృద్ధి చెందాల్సిన అవసరం ఉందని ఎమిరేట్స్ ఎయిర్‌లైన్ డిప్యూటీ ప్రెసిడెంట్ అద్నాన్ కరీమ్ తెలిపారు.

# భారీ లాభాలకు అవకాశం



ముంబై: దలాల్ స్ట్రీట్ ఈ వారం భారీ కొనుగోళ్లతో కళకళలాడొచ్చని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వ ఏర్పాటు, కేంద్ర మంత్రుల ప్రమాణ స్వీకారంతో ఆర్థిక సంస్కరణల కొనసాగింపుపై మరింత స్పష్టత రావడంతో బుల్ పరుగులు తీసే వీలుందంటున్నారు. ఇక అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశం నుంచి ఈ వారం మార్కెట్లు సంకేతాలు అందిపుచ్చు కోవచ్చు. అలాగే దేశీయ ద్రవ్యోల్బణ గణాంకాలు, ప్రపంచ పరిణామాలు ఈ వారం ట్రేడింగ్‌ను నిర్దేశిస్తాయని స్టాక్ నిపుణులు చెబుతున్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ, విదేశీ ఇన్వెస్టర్ల క్రయ విక్రయాలు, క్రూడాయిల్ ధరలపైనా ఇన్వెస్టర్లు దృష్టి సారించవచ్చంటున్నారు. ఇటీవల పబ్లిక్ ఇష్యూ పూర్తి చేసుకున్న క్రోనాక్స్ ల్యాబ్ సైన్సెస్ షేర్లు సోమవారం ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానున్నాయి. ఇదే రోజున లీ ట్రావెన్యూస్ టెక్నాలజీ ఐపీఓ సోమవారం ప్రారంభమై, బుధవారం ముగుస్తుంది. ఎగ్జిట్ పోల్స్, ఎన్నికల ఫలితాలు, ఆర్‌బీఐ ద్రవ్య విధాన నిర్ణయాల వెల్లడి నేపథ్యంలో గతవారం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ లాభ, నష్టాల మధ్య ట్రేడయ్యాయి. సెన్సెక్స్ 76,795 వద్ద కొత్త రికార్డు నమోదుతో పాటు 2,732 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ 23,339 వద్ద జీవితకాల గరిష్టాన్ని అందుకుంది. మొత్తంగా 759 పాయింట్లు ఆర్జించింది.

# బంగారం ధరలు భారీగా తగ్గాయోచ్..




గత కొన్నిరోజులుగా స్థిరంగా కొనసాగుతోన్న బంగారం ధరలు.. గడిచిన మూడు రోజుల నుంచి భారీగా తగ్గుముఖం పట్టాయి. జూన్ 7 నుంచి జూన్ 10 మధ్య ధరల వత్యాసాన్ని పోలిస్తే బంగారం దాదాపుగా రూ.2 వేలు తగ్గింది. దీంతో తాజాగా బంగారం ధరలు ఇలా ఉన్నాయి. దీంతో 10 గ్రాములు 22 క్యారెట్ల బంగారం ధర రూ. 65,690 కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 71,660 వద్ద కొనసాగుతోంది. మరి దేశంలోని పలు ప్రధాన నగరాల్లో ఈరోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.. దేశ రాజధాని న్యూఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 65,840 కాగా 24 క్యారెట్ల బంగారం ధర రూ. 71,810 వద్ద కొనసాగుతోంది.దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో 22 క్యారెట్ల 10 గ్రాములు బంగారం ధర రూ. 65,690 కాగా, 24 క్యారెట్ల 10 గ్రాములు బంగారం ధర రూ. 71,660గా ఉంది.బెంగళూరులో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 65,690కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 71,660గా ఉంది.చెన్నై విషయానికొస్తే గురువారం ఇక్కడ 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 66,490 కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,540గా ఉంది. హైదరాబాదర్‌లో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 65,690కాగా.. 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 71,660 వద్ద కొనసాగుతోంది.విజయవాడలో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 65,690కాగా.. 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 71,660 వద్ద కొనసాగుతోంది.విశాఖపట్నంలోనూ 22 క్యారెట్ల తులం గోల్డ్ ధర రూ. 65,690కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 71,660గా ఉంది. వెండి ధరల్లో కూడా తగ్గుదల కనిపించింది. దేశంలోని పలు ప్రధాన నగరాల్లో వెండి ధరలు పెరిగాయి. ఢిల్లీలో సోమవారం కిలో వెండి ధర రూ. 91,400కి చేరుకోగా ముంబయి, కోల్‌కతా, పుణె వంటి నగరాల్లో ఇదే ధర కొనసాగుతోంది. ఇక హైదరాబాద్‌తో పాటు, విజయవాడ, విశాఖపట్నంలో అత్యధికంగా రూ. 95,900కి చేరింది. ఈ ధరలు ఈరోజు ఉదయం ఆరు గంటలకు నమోదైనవిగా గమనించగలరు. బంగారం కొనుగోలు చేసే ముందు ఒకసారి ధరలు చెక్ చేసుకోవడం బెటర్.

# సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే - వడ్డీ ఎక్కువ చెల్లించాలా.?



లోన్ కోసం ప్రయత్నించగానే మొదటగా వచ్చే ప్రశ్న సిబిల్ స్కోర్ ఎంత ఉంది.? ఈ సిబిల్ స్కోర్ ఆధారంగానే ఒక వ్యక్తికి రుణం ఇవ్వాలా లేదా.? అని బ్యాంకులు నిర్ణయానికి వస్తాయి.అందుకే సిబిల్ స్కోర్‌ను పదిలంగా కాపాడుకోవాలని ఆర్థిక రంగ నిపుణులు హెచ్చరిస్తూనే ఉంటారు. మనకు తెలిసో, తెలియకో ఏదో చిన్న రుణాన్ని నిర్లక్ష్యం చేసినా అది సిబిల్ స్కోర్‌పై తీవ్ర ప్రభావం పడుతుంది. సాధారణంగా 750 కంటే ఎక్కువగా ఉంటే అది మంచి స్కోర్‌గా బ్యాంకులు పరిగణిస్తాయి. ఈ స్కోర్ ఉన్న వాళ్లకు వెంటనే రుణాలను అందిస్తాయి. కొన్ని సందర్భాల్లో ప్రీ అప్రువుడ్ లోన్స్‌ను సైతం ఇస్తాయి. అయితే 600 లేదా అంతకంటే తక్కు స్కోర్ ఉన్నా, క్రెడిట్ హిస్టరీ బాగా లేకపోయినా బ్యాంకులు ఎట్టి పరిస్థితుల్లో రుణాలు ఇవ్వడానికి ముందుకు రావు. ఒకవేళ ఇచ్చినా అత్యధికంగా వడ్డీని వసూలు చేస్తాయి. సిబిల్ స్కోర్‌కు వడ్డీ రేటుకు సంబంధం ఉంటుందని మీకు తెలుసా.? అవును తక్కువ సిబిల్ స్కోర్ ఉన్న వారి నుంచి బ్యాంకులు ఎక్కువ వడ్డీని వసూలు చేస్తాయి. ఉదాహరణకు మీ సిబిల్ స్కోర్ 820గా ఉందనుకుంటే మీకు హౌజింగ్ లోన్ 8.35 శాతానికి లభిస్తుంది. అదే మీ స్కోర్ 580 అయితే మీ నుంచి 10.75 శాతం వడ్డీని బ్యాంకులు వసూలు చేస్తాయి. ఒకవేళ మీరు రూ. 50 లక్షల రుణం తీసుకుంటే మీరు వడ్డీ రూపంలో రూ. 53 లక్షలు చెల్లిస్తారు. అదే మీ స్కోర్ 850 అయితే మీరు వడ్డీ రూపంలో ఏకంగా రూ. 71.82 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న కారణంగా మీరు ఏకంగా రూ. 18.82 లక్షలు అదనంగా చెల్లించాల్సి వస్తుంది.

# పేటీఎంలో ఉద్యోగ కోతలు..



న్యూఢిల్లీ: పేటీఎం బ్రాండ్‌పై ఆర్థిక సేవలను అందిస్తున్న వన్ 97 కమ్యూనికేషన్స్ పెద్ద సంఖ్యలో ఉద్యోగుల్నితొలగించింది. ఎంతమందిని తొలగించిందీ మాత్రం కంపెనీ అధికారికంగా వెల్లడించలేదు. వారు వేరే సంస్థల్లో ఉద్యోగం సాధించడంలో తాము సాయపడుతున్నట్లు కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. 'కంపెనీ పునర్వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగా ఉద్యోగ కోతలు చేపట్టాల్సి వచ్చింది. ఉద్యోగ విరమణ చేసిన వారికి వేరే సంస్థలో ఉద్యోగ కల్పించడంలో తోడ్పడుతున్నాం. మా హెచ్‌ఆర్ టీమ్ 30 సంస్థలతో కలిసి పనిచేస్తోంది" అని పేటీఎం పేర్కొంది. 2024 మార్చి నాటికి పేటీఎంలో 36,521 మంది పనిచేస్తున్నారు. అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే ఈ సంఖ్య 3,500 వరకు తగ్గింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై.. రిజర్వ్ బ్యాంక్ చర్యల నేపథ్యంలో పేటీఎం ఉద్యోగ కోతలు చేపట్టింది. ఇప్పుడు మరోసారి ఉద్యోగులకు ఉద్వాసన పలకాలని నిర్ణయించింది. పెండింగ్‌లో ఉన్న బోనస్‌లను సైతం పేటీఎం విడుదల చేసింది. పారదర్శకంగా లేఆఫ్‌ల ప్రక్రియ చేపడుతున్నట్లు కంపెనీ పేర్కొంది. పేటీఎం పేమెట్స్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ ఆంక్షల నేపథ్యంలో కంపెనీ నష్టాలు పెరిగాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.167.5 కోట్ల నష్టాలను ప్రకటించిన ఆ సంస్థ.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో చివరి త్రైమాసికంలో నష్టం రూ.550 కోట్లకు పెరిగింది. దీంతో ఫలితాల వెల్లడి సమయంలోనే ఉద్యోగ కోతలుంటాయని సంకేతాలు ఇచ్చింది. ఏఐ వినియోగాన్ని పెంచి తద్వారా పరిమిత సంఖ్యలో ఉద్యోగులతో కొనసాగాలని నిర్ణయానికొచ్చింది. కంపెనీని లాభదాయకతలోకి తీసుకురావడంపై పనిచేస్తున్నట్టు పేర్కొంది.

# టెస్లా విజయం వెనుక ఇండియన్..



గ్లోబల్ మార్కెట్లో అమెరికన్ కంపెనీ టెస్లా ఎంత ఎత్తుకు ఎదిగిందో అందరికి తెలుసు. అయితే ఆ సంస్థ నేడు ఈ స్థాయికి రావడానికి కారణమైన వారిలో భారతీయ సంతతికి చెందిన వ్యక్తి ఒకరు ఉన్నారని బహుశా చాలా మందికి తెలియకపోవచ్చు.ఆయనే 'అశోక్ ఎల్లుస్వామి'. ఈయనకు మస్క్ కృతజ్ఞతలు చెబుతూ తన ఎక్స్ (ట్విటర్) ఖాతాలో ట్వీట్ చేశారు.టెక్ బిలియనీర్ అశోక్ ఇటీవల తన ఎక్స్ (ట్విటర్) వేదికగా టెస్లా సీఈఓ 'ఇలాన్ మస్క్'ను ప్రశంసించారు. కంపెనీలో ఏఐ / ఆటోపైలెట్ విభాగాలు అభివృద్ధి చెందడం వెనుక మస్క్ పాత్ర అనన్యసామాన్యమని అన్నారు. ప్రారంభంలో ఈ టెక్నాలజీ స్టార్ట్ చెయ్యాలనే ఆలోచనను మస్క్ చెప్పినప్పుడు.. అసలు అది సాధ్యమవుతుందా అని అందరు అనుకున్నారు. కానీ మస్క్ ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా.. టీమ్‌ను ముందుకు నడిపించారు. అనుకున్న విధంగా ముందుకు వెళుతూ 2014లో ఆటోపైలట్‌ను ఓ చిన్న కంప్యూటర్‌తో స్టార్ట్ చేసాము. అది కేవలం 384ా× మెమరీ మాత్రమే కలిగి ఉంది. ఆ తరువాత లేన్ కీపింగ్, లేన్ ఛేంజింగ్, లాంగిట్యూడినల్ కంట్రోల్ ఫర్ వెహికల్స్ వంటి వాటిని అమలు చేయాలని మస్క్ ఇంజనీరింగ్ టీమ్‌కు చెప్పారు. ఇది మాకు చాలా క్రేజీగా అనిపించింది. అయినా పట్టు వదలకుండా 2015లో టెస్లా ప్రపంచంలోనే మొట్టమొదటి ఆటోపైలట్ సిస్టమ్‌ను తీసుకువచ్చాము. ఆటోపైలెట్ కోసం ఇతరుల మీద ఆధారపడకుండా.. కంపెనీలోనే చేయడం ప్రారంభించాము. కేవలం పదకొండు నెలల్లోనే ఈ లక్ష్యాన్ని సాధించాం. ఇది టెస్లా బలమైన ఏఐ బృందం సాధించిన గొప్ప విజయం. మస్క్ కేవలం బలమైన ఏఐ సాఫ్ట్‌వేర్ కోసం మాత్రమే కాకుండా, శక్తివంతమైన ా× హార్డ్‌వేర్ కోసం కూడా ప్రయత్నించారు. ఇందులో భాగంగానే న్యూరల్ నెట్‌వర్క్‌లను సమర్థవంతంగా అమలు చేయడానికి సిలికాన్‌ను తయారు చేసాము.మొత్తం మీద ఏఐలో టెస్లా విజయానికి మస్క్ కీలకమైన వ్యక్తి. ఇది ఆయనకు టెక్నాలజీ మీద ఉన్న అవగాహన, పట్టుదల వల్ల సాధ్యమైంది. గొప్ప గొప్ప టెక్నాలజీలను ఇతరులు చూడకముందే మస్క్ కనిపెడుతున్నారు. అదే టెస్లాను వాస్తవ ప్రపంచా×లో అగ్రగామిగా నిలిపింది. రాబోయే రోజుల్లో ఫుల్లీ అటానమస్ కార్లు, హౌస్ హెల్డ్ రోబోట్స్ సర్వ సాధారణమైపోతాయని అశోక్ ఎల్లుస్వామి.. మస్క్‌ను గొప్పగా ప్రశంసించారు. థాంక్యూ అశోక్ అని ప్రారంభించి.. అశోక్ టెస్లా ఆటోపైలట్ బృందంలో చేరిన మొదటి వ్యక్తి. నేడు ఆటోపైలట్ సాఫ్ట్‌వేర్‌లకు నాయకత్వం వహించే స్థాయికి ఎదిగారు. అతడు.. మా అద్భుతమైన టీమ్ లేకుండా మేము విజయాలను సాధించి ఉండేవారము కాదేమో.. అంటూ ఎల్లుస్వామి ట్వీట్‌కు రిప్లై ఇచ్చారు.


## నీట్ పవిత్రత దెబ్బతింది..

# మాకు సమాధానం కావాలి




న్యూఢిల్లీ: వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సిలింగ్‌పై స్టే ఇవ్వడానికి సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. ప్రశ్నాపత్రం లీకయిన కారణంగా నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) అండర్‌గ్రాడ్యుయేట్(యుజి) పరీక్ష–2024ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్పందించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) మే 5వ తేదీన నీట్–యుజి పరీక్షను నిర్వహించింది. జూన్ 4న పరీక్షా ఫలితాలు వెలువడడంతో పరీక్షల్లో విజేతలైన అభ్యర్థులకు ఎంబిబిఎస్, బిడిఎస్, ఆయుష్, సంబంధిత ఇతర కోర్సులలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం కౌన్సిలింగ్ ప్రారంభం కావలసి ఉంది. నీట్ పరీక్ష లీకైందని, దీనిపై దర్యాప్తు జరిపించాలని కోరుతూ శివంగి మిశ్రాతోపాటు ఇతర వైద్య ప్రవేశ ఆశావహులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఎ అమానుల్లాతో కూడిన వెకేషన్ బెంచ్ కేంద్రానికి, ఎన్‌టిఎకి నోటీసులు జారీచేసింది. నీట్ 2024 పరీక్షను రద్దు చేయాలని మిశ్రా తన పిటిషన్‌లో అర్థించగా అది అంత సులభం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. నీట్ పరీక్షను పరమ పవిత్రంగా చేశారని, ఇప్పుడు దాని పవిత్రత దెబ్బతిందని, ముందుగా తమకు సమాధానాలు కావాలని జస్టిస్ అమానుల్లా ఎన్‌టిఎ తరఫు న్యాయవాదికి తెలిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది పదేపదే కౌన్సిలింగ్ నిలుపుదల కోసం కోరగా అందుకు ధర్మాసనం తిరస్కరించింది. కౌన్సిలింగ్‌ను ఆపే ప్రసక్తి లేదని, ఇదే విధంగా వాదిస్తే పిటిషన్‌ను కొట్టివేస్తామని పిటిషనర్ తరఫు న్యావాదిపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసు తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, నీట్–యుజి 2024 ఫలితాల ప్రచురణపై స్టే విధించడానికి చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ మే 17న నిరాకరించారు. ఇందుకు సంబంధించి దాఖలైన పిటిషన్‌కు జవాబు ఇవ్వాలని కేంద్రానికి, ఎన్‌టిఎకు నోటీసులు జారీచేసిన సిజెఐ ఈ కేసు విచారణను జులైకు వాయిదా వేశారు. ఇప్పుడు ఈ రెండు పిటిషన్లపై విచారణ జరుగుతుంది. పిటిషనర్ల తరఫున న్యాయవాది మాథ్యూస్ నెడుంపరా వాదిస్తూ నీట్ యుజి అడ్డిషన్ల కౌన్సిలింగ్ నిలిపివేయాలని కోరారు. దీన్ని తిరస్కరించిన ధర్మాసనం కౌన్సిలింగ్ ప్రారంభం కావలసిందేనని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీ వల్ల నిజాయితీగా పరీక్షను రాసిన అభ్యర్థులు నష్టపోగా కొందరు అభ్యర్థులు లబ్ధిపొందారని పిటిషనర్లు వాదించారు.

# నేటి నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం



హైదరాబాద్: జూన్ 12న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నట్లు రెవెన్యూ గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన పాఠశాలల పునఃప్రారంభం సహా పలు అంశాలపై కొత్తగూడెం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పేద పిల్లలకు మంచి విద్య అందించే లక్ష్యంతో అమ్మ ఆదర్శ పాఠశాలలు పనిచేస్తాయని మంత్రి చెప్పుకొచ్చారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. "రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం విద్యతోపాటు ఇంగ్లీష్ మీడియం కూడా అందిస్తున్నాం. కళాశాల విద్యకూ పెద్దపీట వేస్తున్నాం. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాఠశాలకు మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలమైంది. రూ.39వేల కోట్లతో మిషన్ భగీరథ పథకం ప్రారంభించినా.. జిల్లాలోని గిరిజన ప్రాంతాలకు వాటర్ సప్లై అధ్వానంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ పథకాన్ని పునరుద్ధరించి గిరిజన ప్రాంతాలకు తాగునీటి సమస్య లేకుండా చేస్తాం. ధరణిపై కమిటీ నివేదిక త్వరలో రానుంది, అందులోని ఇబ్బందికర అంశాలను తొలగించి, పెండింగ్‌లో ఉన్న 2.55లక్షల దరఖాస్తులు పరిష్కరిస్తాం. విత్తనాలు అందుబాటులో లేవని బీఆర్‌ఎస్ ప్రచారం చేస్తోంది. మేలైన ఒకే రకం విత్తనాలపై ప్రచారం చేసి కృత్రిమ డిమాండ్ సృష్టిస్తూ రైతులను బీఆర్‌ఎస్ నేతలు ఆందోళనకు గురి చేస్తున్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్‌ఉండదంటూ దుష్ప్రచారాలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పవర్ కట్ అనే సమస్యే లేదు. ప్రభుత్వ స్థలాలను ఏ స్థాయి వ్యక్తులు కబ్జా చేసినా.. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు మూసుకొని ఉండదు" అని హెచ్చరించారు.

# ఇక దేశవ్యాప్తంగా సంస్థాగత మార్పులు




న్యూఢిల్లీ: కేంద్రంలో బిజెపి సారథ్యంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడిన దరిమిలా కమలం పార్టీ ఇక సంస్థాగత మార్పులపై దృష్టి సారించనున్నది. మొదట దేశవ్యాప్తంగా సభ్యత నమోదును చేపట్టి ఆ తర్వాత రాష్ట్రాలలో అంతర్గత ఎన్నికలను పూర్తి చేసి ఆ తర్వాత రాష్ట్రాలకు కొత్త అధ్యక్షుల ఎన్నికలను నిర్వహించనున్నది. బిజెపి ప్రస్తుత అధ్యక్షుడు జెపి నడ్డా పదవీకాలం జూన్ 30తో ముగియనున్నది. కాగా..అత్యవసర పరిస్థితులలో అధ్యక్షుడు పదవీ కాలానికి సంబంధించి నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని పార్టీ అత్యున్నత విభాగం పార్లమెంటరీ బోర్డుకు అప్పగిస్తూ బిజెపి నియమావళిలో ఇటీవల సరవణలు తీసుకువచ్చారు. తన స్థానంలో కొత్త అధ్యక్షుడి ఎన్నిక పూర్తయ్యేవరకు నడ్డాను కొనసాగిస్తూ పార్టీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. అయితే తుది నిర్ణయం పార్టీ అగ్రనేతలపైనే ఆధారపడి ఉంటుందని వారు చెప్పారు. నడ్డాను కేంద్ర ఆరోగ్య, రసాయనాలు, ఎరువుల శాఖలను కేటాయించడంతో ఆయన వారసుడి కోసం అన్వేషణ పార్టీలో మొదలైంది. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బిజెపి అధ్యక్షుడిగా అమిత్ షా ఉన్నారు. ఆయన కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఆయన స్థానంలో నడ్డాను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ నియమించింది. అనంతరం 2020 జనవరిలో ఆయన పూర్తికాలం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ కొత్త సాంప్రదాయాన్ని అనుసరించే ఇప్పుడు కూడా పూర్తికాలం అధ్యక్షుడి నియామకం జరిగే వరకు వర్కింగ్ ప్రెసిడెంట్‌ను నియమించే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. ప్రధాని నరేంద్ర మోడీ 2019లో రెండవ సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినపుడు పార్టీ సంస్థాగత వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిస్తారన్న ఆలోచనతోనే నడ్డాను తన మంత్రివర్గం నుంచి తప్పించారు. అయితే పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయగల అనుభవజ్ఞులైన సీనియర్ నాయకులు ఇప్పుడు కేంద్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టడంతో కొత్త అధ్యక్షుడి ఎంపిక పార్టీ నాయకత్వానికి సవాలుగా మారింది. పార్టీకి సారథ్యం వహించగల సమర్థులుగా భావించిన ధర్మేంద్ర ప్రధాన్, భూపేందర్ యాదవ్ తాగాజా మోడీ ప్రభుత్వంలో మంత్రి పదవులు చేపట్టారు. దీంతో రాష్ట్రాలకు చెందిన నాయకులనో లేక జాతీయ ప్రధాన కార్యదర్శులలో ఒకరినో పార్టీ అధ్యక్ష పదవికి ఎంపిక చేసే అవకాశం కనపడుతోంది. కొందరు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర ప్రభుత్వాలు లేదా కేంద్ర ప్రభుత్వంలో చోటు దక్కించుకోవడం, ఉత్తర్ ప్రదేశ్ వంటి కీలక రాష్ట్రంలో పార్టీకి ఇటీవలి ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగలడంతో రాష్ట్ర అధ్యక్షులుగా కొత్త వారిని ఎంపిక చేయాల్సిన అవసరం ఏర్పడింది. పశ్చిమ బెంగాల్ బిజెపి అధ్యక్షుడు సుకాంత మజుందార్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. బీహార్ బిజెపి అధ్యక్షుడు సామ్రాట్ చౌదరి రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైని రాష్ట్రంలో పారీ సారథిగా కూడా ఉన్నారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సిపి జోసి ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో సామాజిక సమతుత్యత కోసం అక్కడ రాష్ట్ర అధ్యక్షుడిని మార్చాల్సిన అవసరం ఏర్పడింది. ఉత్తర్ ప్రదేశ్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో బిజెపికి తగిలిన ఎదురుదెబ్బ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భూసేంద్ర సింగ్ చౌదరిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎన్నికల ప్రచారంపై దృష్టంతా నిమగ్నం చేయడంతో సంస్థాగత ఎన్నికలను, మార్పులను తాత్కాలికంగా పార్టీ పక్కనపెట్టినట్లు వర్గాలు తెలిపాయి. ఇప్పుడు మోడీ 3.0 కూడా కొలువుదీరిన నేపథ్యంలో వెంటనే సంస్థాగత వ్యవహారాలపై పార్టీ అగ్ర నాయకత్వం దృష్టి సారించనున్నట్లు వారు చెప్పారు. లోక్‌సభలో బిజెపి మెజారిటీని కోల్పోయినప్పటికీ ఎన్‌డిఎ మిత్రపక్షాలతో కలసి 272 మెజారిటీ మార్కును సులభంగానే దాటేసింది.

# భారత ఆర్థిక పురోభివృద్ధిలో యువతదే కీలకపాత్ర

## – తెలంగాణ జార్ఖండ్ గవర్నర్ సిపి రాధాకృష్ణన్

## – ఘనంగా తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం మూడవ స్నాతకోత్సవం




సిద్దిపేట: 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థూల జాతీయోత్పత్తిగా ఎదిగేందుకు భారత్ కు పుష్కల అవకాశాలు ఉన్నాయని, ఇది వికసిత్ భారత్ ద్వారా సాధ్యం అవుతుందని, అందులో యువత ప్రముఖ పాత్ర పోషించాలని తెలంగాణ, జార్ఖండ్ రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు లో జూన్ 11వ తేదీన జరిగిన కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ మాట్లాడుతూ. భారత స్థూల జాతీయోత్పత్తికి 18% పైగా వ్యవసాయమే ఆధారమైన నేపథ్యంలో మరింత వృద్ధిరేటుకై ప్రభుత్వం సహజ, సేంద్రియ వ్యవసాయానికి మరింత మద్దతునిస్తుందని తెలిపారు. వ్యవసాయంతోపాటు ఉద్యాన అటవీ రంగాలకు ప్రాధాన్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో 70% పైగా గ్రామీణులకు ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయమే అని, 82 శాతం పైగా చిన్న సన్నకారు రైతులే అని పేర్కొన్నారు. విద్యార్థులు విజయమే ధ్యేయంగా ముందుకు సాగాలని కష్టాలు ఎదురైతే విరామం ఇవ్వచ్చు కానీ వెనుక తిరిగొద్దని గవర్నర్ పిలుపునిచ్చారు. పెద్దగా ఆలోచించాలని వాటిని చేరుకునేందుకు ఆరంభం సైతం చేరువ అంతే పెద్దగా ఉండాలని అన్నారు. ప్రపంచంలో అబ్రహం లింకన్, నరేంద్ర మోడీ ప్రపంచంలో తనదైన ముద్ర వేశారని, పేదరికం ఆకలి బాధతో కొట్టుమిట్టాడుతున్న జనాలకు వాటి నుంచి విముక్తి కల్పించిన గొప్ప వ్యక్తి భారత ప్రధాని నరేంద్ర మోడీ అని గవర్నర్ పేర్కొన్నారు. చదువుతో సహా ప్రతి అంశంలో నాణ్యతను చూపించినట్టయితే విజయం తథ్యమని అందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయని తెలిపారు. విద్యలో నాణ్యతను పెంపొందించేందుకు రాజ్ భవన్ ఎప్పుడు సిద్ధంగానే ఉంటుందని ఈ సందర్భంగా గవర్నర్ తెలిపారు. తరుగుతున్న సాగు నేల, సహజ వనరులు, పంటల ఉత్పాదకత అలాగే పర్యావరణ మార్పుల నేపథ్యంలో సుస్థిర ఆహార, పోషక భద్రత సాధించడంతోపాటు సూ ర్ ఎకానమిక్ పవర్ గా భారత్ ఎదిగేందుకు టెక్నాలజీ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి. గీతాలక్ష్మి అన్నారు. స్నాతకోత్వానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ. ప్రెసిషన్ ఫామింగ్, బిగ్ డేటా, కృత్రిమ మేధస్సు, రోబోట్స్, డ్రోన్స్, రిమోట్ సెన్సింగ్ వంటి ఆధునిక వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులకు పరిచయం చేయాలని, దాని ద్వారా పంటల ఉత్పాదకత పెరుగుతుందని ఆమె అన్నారు. పంట కోతనంతరం 20 నుంచి 30 శాతం దిగుబడి నష్టం జరుగుతున్న నేపథ్యంలో, పంట ఉత్పత్తుల మేలైన నిల్వలకు కావాల్సిన సదుపాయాల్ని కల్పించుకోవాలని అన్నారు. స్పీడ్ బ్రేకింగ్ ఉంటాయి ఆధునిక పరిజ్ఞానంతో తక్కువ వ్యవధి ఉండే నూతన రకాల అభివృద్ధి రెండు మూడు సంవత్సరాల్లోనే పూర్తవుతుంది అన్నారు. జీన్ ఎడిటింగ్, జీన్ పిరమిడ్ పద్ధతుల ద్వారా చలిని, అధిక వేడిని, నీటి ఎద్దడిని తట్టుకునే పంట రకాల రూపకల్పన సుసాధ్యమని పేర్కొన్నారు. ఉపాధి కోసం ఎదురుచూసే వ్యక్తిగా కంటే ఉపాధి కల్పించే శక్తిగా విద్యార్థులు ఎదగాలని డాక్టర్ గీతా లక్ష్మి పేర్కొన్నారు. దేశంలో వ్యవసాయ, ఉద్యాన ఆధారిత అంకుర పరిశ్రమలకు పుష్కల భవిష్యత్తు ఉన్న నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధిపై విద్యార్థులు దృష్టి సారించాలని నైపుణ్యభారత్ కు సైతం ఇది దోహదం చేస్తుందని ఆమె తెలిపారు. కష్టపడే లక్షణం విద్యార్థులు అలవర్చుకుంటే విజయం తప్పక వరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ శ్రీమతి బి. నీరజ ప్రభాకర్ స్వాగత ఉపన్యాసం, అలాగే అభివృద్ధి నివేదికను గవర్నర్ కు విన్నవించారు. మేలైన ఉద్యాన మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన శిక్షణ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులకు అందిస్తుందని, అలాగే క్షేత్రస్థాయిలో రైతులకు సాంకేతిక సలహాలు అందిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆమె తెలిపారు. తెలంగాణలో రైతులు సాగు చేస్తున్న బాలనగర్ సీతాఫలం, ఆర్మూరు పసుపు తోపాటు మరికొన్ని స్థానిక పంటలకు భౌగోళిక గుర్తింపు, రైతు వంగడాల రిజిస్ట్రేషన్, పామ్ ఆయిల్ పై పరిశోధనలు, ప్రధాన ఉద్యాన పంటల్లో సేంద్రీయ సాగు, నూతన రకాల అభివృద్ధి ఆమె తెలిపారు. రైతులకు శాస్త్రీయతతో కూడిన ఉద్యాన దర్శిని ప్రచురణతో పాటు గ్రామాల దత్తత, విస్తరణ కార్యక్రమాల ద్వారా రైతులకు నూతన ఉద్యాన పరిజ్ఞానాన్ని అంద అందజేస్తున్నట్లు డాక్టర్ నీరజ ప్రభాకర్ తెలిపారు.

**విద్యార్థులకు బంగారు పతకాల ప్రధానం..**

బీఎస్సీ హానర్స్ హార్టికల్చర్ లో అత్యధిక ఓజిపిఏ సాధించినందుకు గాను 2023 బ్యాచ్ కు చెందిన ఆర్, వరలక్ష్మి మూడు బంగారు పతకాలు అందుకున్నారు. బిఎస్సి హానర్స్ ఫారెస్ట్రీలో పిసిసిఎఫ్ గోల్డ్ మెడల్ కె. రవళి,గోల్డ్ మెడల్ కె. ప్రత్యూష అందుకున్నారు. ఎమ్మెస్సీ హార్టికల్చర్ లో అన్ని విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను ఎస్కేఎల్ టి ఎస్ హెచ్ గోల్డ్ మెడల్, అలాగే విద్యార్థినిలలో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను, ఇంకా కూరగాయల విభాగంలో టాపర్గా నిలిచినందుకుగాను గాను ఎం.మాళవిక మూడు గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. పండ్ల శాస్త్ర విభాగంలో జిఎస్ దివ్య, పూల శాస్త్ర విభాగంలో పీ. విద్య శ్రీ, అలాగే ఔషధ, సుగంధ ద్రవ్య పంటల విభాగంలో పి.మహేశ్వరి గోల్డ్ మెడల్స్ అందుకున్నారు.

**విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రధానం....**

ఈ మూడవ స్నాతకోత్సవంలో 156 మంది కి ఉద్యాన డిగ్రీ, 50 మందికి ఫారెస్ట్ డిగ్రీ, 45 మందికి ఉద్యాన పీజీ, 30 మంది ఫారెస్ట్ పీజీ, అలాగే మరో ఆర్గుకి పీహెచ్డ్ డాక్టరేట్ పట్టాలు ప్రధానం.

# జులై 1న ఒక్కొక్కరికి 7 వేలు ఫించన్

## ఏపీ కొత్త సర్కార్ కసరత్తులు షురూ..!

**అమరావతి:** ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి టీడీపీ, జనసేన, బీజేపీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. వీరి విజయానికి ఎన్నికలకు ముందు కూటమి ప్రకటించిన ఉమ్మడి మేనేఫెస్టో కూడా ఒక కారణం. అందులో ఫించన్ల పెంపు అంశం సామాన్యుడిని అమితంగా ఆకర్షించిందని ప్రత్యేకగా చెప్పనవసరం లేదు. వృద్ధాప్య పింఛన్ 4వేలు, దివ్యాంగులకు 6వేలకు పెంచుతామని హామీనిచ్చాయి. ఏప్రిల్ నెల నుంచే పెరిగిన సామాజిక భద్రత పింఛన్లను అందిస్తామని హామీ ఇచ్చింది. పెరిగిన పింఛన్ జులై 1వ తేదీన అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 65.30 లక్షల మంది పింఛను లబ్ధిదారులుండగా ఇప్పటి వరకు పింఛను నగదు చెల్లింపులకుగాను నెలకు 1,939 కోట్లను ప్రభుత్వం విడుదల చేస్తూ వచ్చింది. ఏప్రిల్ నుంచే 4వేల పింఛను పెంపు అమలు చేస్తే ఒక్కొక్కరికి 7వేల చొప్పున జులై 1న పింఛను పంపిణీ చేయవల్సి ఉంటుంది. పెరిగిన పింఛను 4 వేలుతోపాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు 1000 చొప్పున 3వేలు మొత్తం కలిపి వచ్చే నెలలో ఒక్కొక్కరికి 7 వేలు పంపిణీ చేయనున్నారు. మరోవైపు దివ్యాంగులకు 6 వేల చొప్పున పింఛను జులై 1న పంపిణీ చేయడానికి 4,400 కోట్లు అవసరం అవుతాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఆగస్టు నుంచి అయితే నెలకు రూ.2,800 కోట్లు వ్యయం అవుతుందని లెక్కగట్టిన అధికారులు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందించనున్నారు. దివ్యాంగ పింఛనుదారులు రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల మంది ఉన్నారు. వీరికి ప్రస్తుతం రూ.3 వేలు పింఛను అందిస్తున్నారు. వీరి పింఛనును రూ.6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు.

పూర్తిస్థాయిలో వైకల్యానికి గురైన వారికి నెలకు రూ.15 వేలు, కిడ్నీ, తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10 వేల పింఛను అందిస్తామని కూటమి మేనేఫెస్టోలో పేర్కొంది. వీరందరి వివరాలను వైద్యశాఖ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు సేకరిస్తున్నారు.

# మలేరియా వ్యతిరేక మాసోత్సవం పై అవగాహన కార్యక్రమం

**మద్దికేర:** మద్దికేర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధికారిణులు డాక్టర్ శ్రీలక్ష్మి,డాక్టర్ రాగిణి ఆధ్వర్యంలో మంగళవారం రోజున ఆశాడే కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణులు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు మాతా శిశు మరణాలు నివారించడానికి గర్భవతులకు ఫోన్ నెంబర్లను సేవ్ చేయించాలని,మెసేజ్లను వినిపించాలని మరియు మాత శిశు ఆరోగ్య సేవలపై అవగాహన పెంచాలని తెలియజేశారు. అధిక ప్రమాద సంకేతాలు ఉన్న గర్భవతులను మరియు రక్తహీనత గల గర్భవతులను గుర్తించి తగిన చికిత్స వైద్యాధికారులచే అందజేయాలని సూచించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఐదు సంవత్సరం లోపల పిల్లలు ఉన్న వారికి అతిసార, విరేచనాలు నివారణకు కృషి చేయాలని వారు తెలియజేశారు. అనంతరం ప్రతి సంవత్సరం జూన్ మాసంలో నిర్వహించే మలేరియా వ్యతిరేక మాసోత్సవాలపై ఆశా కార్యకర్తలకు అవగాహన కలిగించి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com